# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :297 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 07-02-2025 | పేజీలు:4 వెల: 2.00


### ఆర్జే శేఖర్‌బాషాపై మరో కేసు నమోదు

హైదరాబాద్,ఫిబ్రవరి6: లావణ్య ఇచ్చిన ఫిర్యాదుతో మస్తాన్ సాయి అరెస్ట్ అయి జ్యూడిషియల్ రిమాండ్‌కు వెళ్లారు. అలాగే బిగ్ బాస్ ఫేమ్,ఆర్జే శేఖర్ భాషాపై కూడా లావణ్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా.. శేఖర్ బాషాపై నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో మరో కేసు నమోదు అయ్యింది. శేఖర్ బాషాపై కొరియోగ్రాఫర్ షష్టి వర్మ ఫిర్యాదు చేశారు. కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై షష్టి వర్మ గతంలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. జానీ మాస్టర్ కేసులో విచారణ జరుగుతుండగా తన వ్యక్తిగత కాల్ రికార్డు లీక్ చేశాడని షష్టి వర్మ ఫిర్యాదులో పేర్కొంది. తన పరువుకు భంగం వాటిల్లేలా, కొన్ని యూట్యూబ్ ఛానెల్స్‌లో మాట్లాడుతున్నాడని మహిళా కొరియోగ్రాఫర్ క్లంపైట్ చేశారు. ఉద్దేశపూర్వకంగా, దురుద్దేశంతో ప్రైవేటు కాల్ రికార్డ్‌లు లీక్ చేశాడని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. శేఖర్ బాషా వ్యక్తిగత మొబైల్‌తో పాటు, అతనితో ఉన్న ఇతర ఎలక్ట్రానిక్ డివైజెస్‌లు సీజ్ చేయాలని బాధితురాలు కోరింది. దీంతో శేఖర్ బాషాపై బీఎన్ఎస్ యాక్ట్ సెక్షన్ 79 ,67, ఐటీ యాక్ట్ 72 కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఏఐసీసీ అగ్రనేతలకు మంత్రి కొండా సురేఖ లేఖ..



హైదరాబాద్: కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేతలకు సోనియా, రాహుల్ గాంధీలకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ మంత్రి కొండా సురేఖ గురువారం లేఖ రాశారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో బీసీ కులగణనను కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా చేపట్టిందని స్పష్టం చేశారు. ఇందుకోసం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా శ్రమించారని వెల్లడించారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలోని బీసీలకు మరింత న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న మేరకు ఈ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని పునరుద్ఘాటించారు. ఈ మొత్తం బీసీ సర్వే ప్రక్రియలో పార్టీ,ప్రభుత్వపరంగా కాంగ్రెస్ అధినాయకత్వం చాలా సహకరించిందని అన్నారు..అందుకు కృషి చేసిన ఏఐసీసీ అగ్రనేతలకు మంత్రి కొండా సురేఖ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు జాతీయ నాయకత్వానికి వేర్వురుగా లేఖలు రాశారు.


## టెట్ పరీక్షల్లో 83,711 మంది అభ్యర్థులు అర్హత

హైదరాబాద్,ఫిబ్రవరి6: రాష్ట్రంలో జనవరి 2 నుంచి జనవరి 20 వరకు 20 సెషన్స్‌లో టెట్ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,75,753 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. పరీక్షలకు 2,05,278 మంది హాజరయ్యారు. వీరిలో రెండు పేపర్లు కలిపి 83,711 (40.78 %) మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఇందులో పేపర్-1లో 69,476 మంది అభ్యర్థులకుగాను 41,327 (59.48 %) మంది క్వాలిఫై అయ్యారు. ఇక పేపర్-2లో మ్యాథ్స్ అండ్ సైన్స్‌లో 69,390 మంది పరీక్షకు హాజరుకాగా.. 23,755 (34.24 %) మంది అభ్యర్థులు అర్హత సాధించారు. సోషల్ స్టడీస్ పేపర్‌లో 66,412 మందికిగాను.. 18,629 (28.205 %) మంది అర్హత సాధించారు. మొత్తానికి పేపర్-1, పేపర్-2 రెండూ కలిపి 2,05,278 మంది పరీక్షలకు హాజరుకాగా.. 83,711 మంది ఉత్తీర్ణత సాధించారు. తెలంగాణలో టెట్ పరీక్షలకు సంబంధించిన ఫలితాలతోపాటు ఫైనల్ ఆన్సర్ కీని విద్యాశాఖ విడుదల చేసింది. పేపర్లు, సబ్జెక్టులవారీగా అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్సర్ కీని అందుబాటులో ఉంచింది. ఆన్సర్ కీతోపాటు అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లు అందుబాటులో ఉన్నాయి. టెట్ పరీక్షలకు సంబంధించిన ప్రిలిమినరీ ఆన్సర్ కీని పాఠశాల విద్యాశాఖ జనవరి 24న విడుదల చేసిన సంగతి తెలిసిందే. అభ్యర్థుల నుంచి జనవరి 25 నుంచి 27న సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలు స్వీకరించింది. టెట్ పరీక్షలకు సంబంధించి 150 మార్కులకు పేపర్-1, 150 మార్కులకు పేపర్-2 నిర్వహించారు. ఒక్కో పేపరులో 150 ప్రశ్నలు ఉంటాయి. పేపర్-1లో 5 విభాగాలు ఉంటాయి.



ఒక్కో విభాగంలో 30 ప్రశ్నలు- 30 మార్కులు కేటాయించారు. ఇక పేపర్-1లో 4 విభాగాలు ఉంటాయి. వీటిలో మొదటి మూడు విభాగాల్లో 30 ప్రశ్నలు- 30 మార్కులు, నాలుగో విభాగానికి 60 ప్రశ్నలు - 60 మార్కులు కేటాయించారు. పరీక్షల్లో అర్హత మార్కులను ఓసీలకు 90గా, బీసీలకు 75గా, ఎస్సీ-ఎస్టీ-దివ్యాంగులకు 60గా నిర్ణయించారు. తెలంగాణలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్, పీజీ ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశాలకు సంబంధించిన పరీక్ష తేదీలు ఖరారయ్యాయి. త్వరలోనే దరఖాస్తు చేసుకోవడానికి రిజిస్ట్రేషన్ ఫీజు ఇతర వివరాలతో కూడిన వివరణాత్మక నోటిఫికేషన్లను సంబంధిత సెట్ కన్వీనర్లు ప్రకటించనున్నారు. టీజీ ఎప్‌సెట్-2025 ఫిబ్రవరి 20న, పీజీఈసెట్ నోటిఫికేషన్ మార్చి 12న విడుదల కానుంది.

## తెలంగాణకు గుడ్‌న్యూస్ చెప్పిన కేంద్రం





హైదరాబాద్,ఫిబ్రవరి6: జాతీయ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ "రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక పెట్టుబడి పథకం "కింద తెలంగాణకు రూ.176.5 కోట్ల విడుదలకు ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద నిర్దేశించిన మైలురాయిని సాధించినందుకు రాష్ట్రాలు ప్రోత్సాహక మొత్తాన్ని పొందేందుకు అర్హులు. తెలంగాణ రాష్ట్రానికి జాతీయ రోడ్డు రవాణా శాఖ అదనపు ప్రోత్సాహక సహాయం అందించింది. తెలంగాణ ఈ పథకం ద్వారా మైల్ స్టోన్ 1లో రూ.51.5 కోట్లు , మైల్ స్టోన్ 2లో రూ.125 కోట్లకు అర్హత పొందింది. అంతే కాకుండా.. మోటార్ వెహికల్ ట్యాక్స్ కన్సెషన్ పథకం కింద తెలంగాణ రూ.50 కోట్లు అర్హత సాధించింది. మైల్ స్టోన్ -2 కింద రాష్ట్ర ప్రభుత్వం 15 సంవత్సరాలు పైబడిన రవాణా వాహనాలను తొలగించేందుకు స్క్రాపింగ్ ప్రణాళికను పంపించింది. ఈ స్క్రాపింగ్ పథకంతో మరో రూ.75 కోట్లు అర్హత సాధించింది. రాష్ట్రంలోని మొత్తం జిల్లాలలో 21 జిల్లాలు ప్రాధాన్యతగా తీసుకుని పని చేయడం ద్వారా తెలంగాణ రూ.31.5 కోట్లు అర్హత పొందింది.

ప్రాధాన్యత లేని జిల్లాలకు రూ.20 కోట్లు పొందేందుకు అర్హత పొందింది. ఈ మైలురాయి కింద మొత్తం అర్హత కలిగిన ప్రోత్సాహకం రూ.51.5 కోట్లు. ఈ ఆర్థిక సాయం రాష్ట్రంలో రవాణా రంగం అభివృద్ధికి ఉపయోగపడనుంది. ఇంతలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రానికి అనుసంధానించే లింక్ రోడ్డు, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధానితో అనుసంధానించే రోడ్లు, ప్రస్తుత రహదారి మౌలిక సదుపాయాల అప్ గ్రేడ్ అనే మూడు విభాగాలుగా వర్గీకరించబడిన పనులను చేపట్టడంలో నియమాలను పాటించాలని మంత్రి అధికారులను కోరారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రోడ్లకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలను సిద్ధం చేయడానికి కన్సల్టెంట్లను గుర్తించాలని ఆదేశించారు. అధ్వాన్నంగా ఉన్న రోడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద చేపట్టిన రోడ్ల పురోగతిని సమీక్షించడానికి సీనియర్ ఆర్ అండ్ బీ అధికారులతో సమావేశమైన మంత్రి.. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

## బీసీ, ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ విస్తృత ప్రచారం.. సీఎల్పీ నిర్ణయం

హైదరాబాద్ : బీసీ కులగణన సర్వే, ఎస్సీ కులాల వర్గీకరణ అంశాలను గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.. చారిత్రాత్మకంగా బీసీ కులాల గణన చేపట్టిన విషయాన్ని అన్నివర్గాల ప్రజలకు చేరాలని సూచించింది.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఇవాళ హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎల్పీ సమావేశం జరిగింది.. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఇటీవల ప్రారంభించిన ప్రతిష్టాత్మక పథకాలు, నిర్ణయాలతో పాటు బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యాచరణపై సీఎం దిశానిర్దేశం చేశారు.. అలాగే బీసీ, ఎస్సీ వర్గీకరణపై రెండు బహిరంగ సభలు పెట్టాలని నిర్ణయించింది. ఈ సభలకు రాహుల్ గాంధీ, ఖర్గేను ఆహ్వానించాలని సీఎల్పీ తీర్మానించింది. ఇక కులగణన సర్వే పై విపక్షాలు చేస్తున్న విమర్శలపై ధీటుగా స్పందించాలని రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలకు సూచించారు. త్వరలోనే స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్ రానుందని కూడా ప్రస్తావించారు.. గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు.



ఆ 10మంది ఎమ్మెల్యేలు దూరం

కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సీఎల్పీ సమావేశానికి పార్టీ ఫిరాయించిన 10మంది ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం పార్టీ ఫిరాయింపుల అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉండటం, శాసనసభ కార్యదర్శి నుంచి నోటీసులు వచ్చిన నేపథ్యంలో వివాదాన్ని మరింత జఠిలం చేసుకోకుండా సీఎల్పీ సమావేశానికి హాజరుకావడం మంచిది కాదనే అభిప్రాయంతోనే దూరంగా ఉన్నట్లు సమాచారం.

## కేంద్ర మంత్రులకు బీఆర్ఎస్ బృందం విన్నపాలు

న్యూఢిల్లీ : తెలంగాణలో ప్రధానమైన పలు రోడ్లను మరింత విస్తృత పర్చేందుకు, అభివృద్ధి చేసేందుకు మరిన్ని నిధులు కేటాయించాల్సిందిగా కోరుతూ కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, ధర్మేంద్ర ప్రధాన్ లకు వినతిపత్రాలు అందజేసింది తెలంగాణ బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల బృందం. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కే.ఆర్.సురేష్ రెడ్డి, దామోదర్ రావు, డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి, మాజీ ఎంపీ బీ.వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ లతో ఉన్న బృందం ఇవాళ పార్లమెంట్ ఆవరణలోని కార్యాలయాల్లో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, ధర్మేంద్ర ప్రధాన్ లతో విడి విడిగా భేటీ అయ్యారు.మానవ వనరుల అభివృద్ధి శాఖ (విద్యా శాఖ) మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో భేటీ అయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్నట్లు తెలంగాణకు ఐఐఏంను వెంటనే మంజూరు చేయాలని, పలు ట్రిపుల్ ఐటీలు, కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో నవోదయ పాఠశాలలను నెలకొల్పాలని కోరారు. అలాగే తెలంగాణలో రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయాలని మరో కేంద్ర మంత్రి గడ్కరీకి విజ్ఞప్తి చేశారు.. బీఆర్ఎస్ నేతలు చెప్పిన అంశాలు, కోరిన పనుల పట్ల కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారు.ఇక ఈసందర్భంగా కేంద్ర మంత్రులు గడ్కరీ, ధర్మేంద్రలకు పుష్పగుచ్చాలిచ్చి



శాలువాలతో సత్కరించారు కేటీఆర్. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు బాల్క సుమన్, డాక్టర్ దాసోజు శ్రావణ్ కుమార్, ఆంజనేయులు గౌడ్, వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల కేటీఆర్ అక్కడే

ఇక ఈనెల 10వ తేదీన ఎమ్మెల్యే అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టనుంది. దీనిపై న్యాయవాదులతో మాట్లాడేందుకు రెండు రోజుల పాటు కేటీఆర్ ఢిల్లీలోనే ఉండనున్నారు..ఈ రెండు రోజుల కార్యక్రమంలో కేటీఆర్ బృందం పలువురు కేంద్ర మంత్రులను కలువనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి..

## 12 నుంచి మినీ మేడారం జాతర



హైదరాబాద్,ఫిబ్రవరి6: ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతరకు సమయం ఆసన్నమైంది. మహాజాతర ముగిసిన ఏడాదికి అదే మాదిరిగా మినీ మేడారం జాతర జరుగుతున్న సంగతి తెలిసిందే. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం ఈ నెల 12 నుంచి మినీ మేడారం జాతర ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు 4 రోజుల పాటు మినీ మేడార జాతర జరగనుంది. బుధవారం మినీ మేడారం జాతరకు అంకురార్పణ జరిగింది. అంటే జాతర ప్రారంభానికి సరిగ్గా వారం రోజుల ముందు గుడి మెలిగె, మండ మెలిగె పండుగను నిర్వహిస్తుంటారు. ఈ నెల 12న జాతర ప్రారంభం కానుండటంతో పూజారులు బుధవారం గుడి మెలిగె పండుగకు శ్రీకారం చుట్టారు. బుధవారం మేడారంలో గల సమక్క ఆలయంలో సిద్ధబోయిన వంశస్థులు, కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయంలో కాక వంశీయులు గుడి మెలిగె పండుగను నిర్వహించారు. ఈ గుడి మెలిగె పండుగలో భాగంగా పూజారులు గుడిని శుద్ధి చేయడంతో పాటు వారి కుటుంబ సభ్యులతో కలిసి డోలు వాయిద్యాలతో అటవీప్రాంతంలోకి వెళ్లి గుట్టగడ్డిని తీసుకువచ్చారు. గడ్డికి పసుపు, కుంకుమలతో పూజలు చేసిన అనంతరం పూజామందిరాన్ని అలంకరించారు. ఈ మండమెలిగె, గుడి మెలిగె పండుగతో మినీ మేడారం జాతర ప్రారంభమైనట్లేనని పూజారులు వెల్లడించారు. ఇప్పటి నుంచి మినీ జాతర ముగిసే వరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పూజలతో పాటు రాత్రివేళల్లో డోలీలతో కొలుపును నిర్వహిస్తారు. అదే విధంగా కొండాయిలో గోవిందరాజులు, నాగులమ్మ జాతరను పురస్కరించుకుని మండమెలిగె పండుగను నిర్వహించారు. అలాగే పూనుగొండ్లలోని పగిడిద్దరాజు ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడారంలోని మినీ మేడారం జాతరకు రూ.32 కోట్లతో ఏర్పాట్లు చేస్తోంది. నాలుగు రోజులపాటు జరిగే ఈ జాతరకు దాదాపు 20 లక్షల మందికి పైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులను కూడా మోహరించనున్నారు.

## నామినేటెడ్ పోస్ట్ లలో బిసిలకు 34 శాతం రిజర్వేషన్

వెలగపూడి :నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చంద్రబాబు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీ నాలెడ్జ్ సొసైటీ కేపాసిటీ బిల్డింగ్ 2025కు ఆమోదం తెలపగా.. పట్టాదార్ పాస్ పుస్తకం చట్ట సవరణకు ప్రతిపాదనపై కేబినెట్ లో చర్చ కొనసాగింది. గాజువాక రెవెన్యూ పరిధిలో భూములు, నిర్మాణాల క్రమబద్ధీకరణపై కేబినెట్ ప్రతిపాదన చేసింది. వెలగపూడిలో సిఎం క్యాంప్ కార్యాలయంలో నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ లో పలు నిర్ణయాలకు ఆమోదముద్ర వేశారు.. నామినేటెడ్ పోస్టుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ 2019లో చేసిన చట్టాన్ని వెనక్కు తీసుకోవడంతో పాటు అందులో లోటుపాట్లు సవరించేలా కొత్తం చట్టం తెచ్చే ప్రతిపాదనపై కేబినెట్ లో ప్రధానంగా చర్చ జరిగింది.అలాగే, ప్రాజెక్టులు మినహా ఏపీ సీఆర్డీఏ చేపట్టే పనులకు టెండర్ల పరిమితి పెంపు కోసం నిబంధనల సవరణకు ఏపీ కేబినెట్ ప్రతిపాదన చేసింది. దీంతో పాటు టీటీడీలోని పోటులో పని చేసే వర్కర్లను సూపర్ వైజర్లుగా అప్ గ్రేడ్ చేస్తూ మంత్రివర్గంలో చర్చ జరిగింది. వీరిని సీనియర్ అసిస్టెంట్ కేడర్కు పదోన్నతి కల్పించే ప్రతిపాదనలు చేశారు. ఇక, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖలో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ కు డైనమిక్ క్యూ మేనేజ్మెంట్ సిస్టమ్ ప్రవేశ పెట్టే ప్రతిపాదనపై ఏపీ కేబినెట్ చర్చించింది .ఇక, తిరుపతి జిల్లాలోని చెన్నై - బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ లో భూములు కోల్పోయిన వారికి పరిహారంగా ఎకరానికి 8 లక్షల రూపాయల చొప్పున ఇచ్చేందుకు ఏపీ కేబినెట్ లో ప్రతిపాదనలు చేసింది. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామం, కోట మండలంలోని కొత్తపట్నం గ్రామ పరిధిలో పరిహారం పెంపు ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే, భారత్ లో తయారైన విదేశీ మద్యం, బీర్, ఎఫ్ఎల్ స్పిరిట్లపై అదనపు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ సవరణకు ప్రతిపాదన చేసింది ఏపీ కేబినెట్.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక విధానంలో మార్పులు

ఎమ్ఎస్ఏఈ పాలసీని గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. ఇండస్ట్రీలిస్టులకు అనేక ప్రోత్సహకాలు ఇచ్చారు. అయితే ఈసారి దాంట్లో స్వల్ప మార్పులు చేస్తూ కేబినెట్ ఆమోదించింది. ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు సంబంధించి వారికి మరిన్ని ప్రోత్సహకాలు అందించే విధంగా కేబినెట్‌లో కీలక నిర్ణయం తీసుకున్నారు. పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించడంతో పాటు.. రాష్ట్రంలోని మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. పోలవరం నిర్వాసితులకు సంబంధించి గత టీడీపీ ప్రభుత్వంలో, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో రెండు సార్లు నగుదును రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఓ వైపు పోలవరం నిర్మాణం జరుగుతుండగానే..




మరోవైపు పోలవరం నిర్వాసితులకు రిహబిలిటేషన్ చేసే విధంగా కేబినెట్‌లో చర్చించారు. సాధ్యమైనంత త్వరగా అక్కడి నిర్వాశితులకు నష్టపరిహారం చెల్లించాలని కేబినెట్ నిర్ణయించింది.

పవన్ కు అస్వస్థత

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు అస్వస్థత కారణంగా కేబినెట్ సమావేశానికి దూరంగాఉన్నారు.ఇదే విషయాన్ని ముందుగానే సమాచారాన్ని అందించారు.

## ప్రభుత్వ స్థలాలు కబ్జా...

హైదరాబాద్,ఫిబ్రవరి6. నగరంలో భూములకు బాగా డిమాండ్ ఉండటంతో ఖాళీ స్థలం కనిపిస్తే చాలా కబ్జాదారులు అక్కడ వాలిపోయి కబ్జాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే సుమారు రూ. 300 కోట్ల విలువచేసే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొంతమంది ప్రభుత్వ సూచిక బోర్డు ఉన్నా దానిని తొలగించి ఆ స్థలంలో షెడ్లు, టెంట్లు వేసి ప్రైవేట్ సైన్యాన్ని కాపలాపెట్టారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10 తట్టిఖానాలో జలమండలి కార్యాలయం పక్కనే ప్రభుత్వానికి చెందిన మూడెకరాల స్థలం ఉంది. గత ఏడాది డిసెంబర్‌లో కొంతమంది ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకుంది. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే కొన్నిరోజులు స్తబ్దుగా ఉన్న కబ్జాదారులు మళ్లీ స్థలంలో షెడ్లు, రెండు టెంట్లు వేసి ప్రైవేటు సైన్యాన్ని కాపలాగా పెట్టారు. ప్రభుత్వ సూచిక బోర్డులను తొలగించారు. సమాచారం అందుకున్న షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి సిబ్బందితో వెళ్లి షెడ్లను, టెంట్లను తొలగించి ప్రభుత్వ బోర్డులను ఏర్పాటు చేశారు.

## సంపాదకీయం

శుక్రవారం 07-02-2025

# అవినీతి వ్యతిరేక పోరాటం పేరుతో వంచించిన కేజ్రీవాల్ !

అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమంలో చేరి..ఆయనకు తానే ఏకలవ్య శిష్యుడిగా ప్రచారం చేసుకుని.. రాజకీయాల్లోకి వచ్చిన ఓ ఐఆర్ఎస్ అధికారి అరవింద్ కేజ్రీవాల్..అవినీతి మరకలతో ఇప్పుడు మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. అవినీతి చుట్టూ కేజ్రీవాల్ అల్లుకు పోయారు. అవినీతికి వ్యతిరేకంగా జన లోక్‌పాల్ బిల్లుకోసం అన్నాహజారే నేతృత్వంలో జరిగిన ఉద్యమమే ఆమ్ ఆద్మీ పార్టీ పుట్టుకకు దారితీసింది. ఢిల్లీ వీధుల్లో ఒకప్పుడు ఆప్ సంచలనంగా మారింది. ఆప్ టోపీలు ధరించి హమ్ ఆమ్ ఆద్మీ హూం.. అనేవారు. అవినీతిపై పోరాటాలు చేశారు. సామాజిక సమస్యలపై నృత్య రూపకాలు ప్రదర్శిస్తూ ప్రజలను ఆకట్టుకునేవారు. సామాన్య ప్రజలకోసం ఇంతగా ఆలోచించిన పార్టీ లేదని, అవినీతి అంతం ఆవాలంటే ఆప్ రావాలన్న పార్టీగా గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యమంత్రి అయిన కొత్తలో కేజీవ్రాల్ ప్రజా సమస్యలపై కేంద్రంపై పోరాడేందుకు నిరసన ప్రదర్శనలు నిర్వహించేవారు. దేశ వ్యాప్తంగా ఒకప్పుడు మాయావతి నేతృత్వంలోని బహుజన సమాజ్ పార్టీ సృష్టించిన సంచలనమే ఆప్ కూడా సృష్టించింది. కేజీవ్రాల్‌తో చేతులు కలిపేందుకు ఎందరో మేధావులు అనేక రాష్ట్రాల్లో ముందుకు వచ్చారు. వారిలో లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ్ వంటి వారు ఉన్నారు. అలాంటి ఆప్ పూర్తిగా కనుమరుగు అయ్యే ప్రమాదం ఏర్పడింది. ఈ క్రమంలో తాజాగా ఢిల్లీ ఎన్నికల్లో గెలిస్తేనే.. కేజ్రీవాల్‌కు రాజకీయ భవితవ్యం ఉన్నట్లు. లేకుంటే ఆయనకు రాజకీయ సమాధి తప్పదు. అవినీతిపై పోరాటంలో కాంగ్రెస్‌పై యుద్దం ప్రకటించిన కేజ్రీవాల్..అనతి కాలంలోనే దేశ ప్రజల మనసులు గెల్చుకున్నారు. ప్రజలు రాజకీయ నాయకుల అవినీతి పట్ల ఎంత అసహ్యంగా ఉన్నారనడానికి కేజ్రీవాల్ ఎదుగుదలే కారణం. కానీ అనతి కాలంలోనే కేజ్రీవాల్ నిజస్వరూపం బయటపడింది. ఆయన ముసుగు తొలగింది. అవినీతికి కేంద్రంగా కేజ్రీవాల్ రాజకీయాలు నడిచాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఇందుకు పరాకాష్ట. అలాగే తన ఇంటిని వందల కోట్లతో అద్బుతంగా..అంటే బిజెపి మాటల్లో శీష్‌మహల్‌గా మార్చుకున్న తీరు ఆయన ప్రతిష్టను బాగా దిగజార్చింది. కాంగ్రెస్ అవినీతిని వ్యతిరేకించిన కేజ్రీవాల్... కాంగ్రెస్ పంచనే చేరారు. ఇప్పుడు ఢిల్లీలో మాత్రం ఆయనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడు తోంది. ఆయన మంత్రులు అంతా అవినీతిలో పట్టుబడ్డారు. నిప్పులేనిదే పొగరాదన్నట్లు ...కేంద్రం ఎంతగా కక్షకట్టి కేసులు పెట్టినా..అవినీతి లేనిదే ఇవి నిలవవు. లిక్కర్ కేసులో బిఆర్ఎస్ అధినేత కవిత దూరిందం టేనే అవినీతి ఉందని స్పష్టం అయ్యింది. ఈ క్రమంలో కేజ్రీవాల్ ఎంతగా ఇప్పుడు అరిచి గీపెట్టినా ప్రజలు నమ్ముతారని అనుకోవడానికి లేదు. గెలుపు కోసం అవినీతి వ్యతిరేక పోరాటాన్ని పక్కన పెట్టిన కేజ్రీవాల్, ఉచిత పథకాలతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నంలో రాజకీయాలు మొదలు పెట్టారు. అవినీతి వ్యతిరేక రాజకీయాలు పక్కన పోయాయి. కేవలం తన స్వార్థ రాజకీయాలు మొదలు పెట్టారు. అందుకే పదేళ్లుగా ఢిల్లీ పీఠం పట్టుకుని గట్టిగా అతుక్కు పోయిన కేజ్రీవాల్‌కు ఈ ఎన్నికలు అంతు సులువు కాదు. ఆయన పక్కన ఉన్న ఎమ్మెల్యేలు అంతా పార్టీని వీడుతున్నారు. కేజ్రీవాల్నిజస్వరూప తెలిసిన వారు బయట పడుతున్నారు. అందుకే ఢిల్లీలో 2013 నుంచీ ముఖ్యమంత్రిగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజీవ్రాల్ భవిష్యత్ ఏమిటి అన్న విషయం గతంలో ఏనాడు లేని విధంగా చర్చ జరుగుతోంది. ఎందుకంటే అవినీతి అన్న వ్యవహారం నుంచి కేజ్రీవాల్ వైదొలిగారు. బిజెపిని ఢీకొంటాడన్న భ్రమలు తొలగిపోయాయి. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజకయాంగా బీజేపీని ఒంటరిగా ఢీకొంటున్నారు. ఆ తరవాత అంతటి తెగువతొ అరవింద్ కేజీవ్రాల్ రాజకీయంగా బిజెపికి ఎదురొడ్డి నిలిచాలిచారు.. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఢిల్లీలో బీజేపీ మొత్తం ఏడు లోక్‌సభ సీట్లు దక్కించుకున్నా, ఆరునెలల తర్వాత 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి పూర్తి మెజారిటీ తెచ్చిపెట్టిందటే అది కేజ్రీవాల్ పట్ల ప్రజలకున్న విశ్వాసంగా చూడాలి. తన పథకాల్లో ప్రజల్లో ఆదరణ లభించడంతో తనకు తిరుగులేదని భావించి ఒక దశలో ప్రధానమంత్రి పదవి కోసం కూడా కలలు కన్న కేజీవ్రాల్, ఆ దిశగా రాజకీయాలు నడిపారు. అదే కేజ్రీవాల్ ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అధునాతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలలు, మహిళలు బస్సెక్కితే ఉచితంగా ప్రయాణించేందుకు గులాబీ రంగు టికెట్, మొహల్లా వైద్యశాలలు.. వీటన్నిటితో ఢిల్లీ ప్రజలు కేజీవ్రాల్ వైపే మొగ్గు చూపారు. ఈ క్రమంలో పథకాలతో ప్రజలను బురిడీ కొట్టించవచ్చని కేజ్రీవాల్‌కు అర్థం అయిపోయింది. అందుకే అవినీతి వ్యతిరేక ఉద్యమకాడిని వదిలేశారు. తానే అవినీతికి కేంద్రంగా మారారు. తన పార్టీవారు, మంత్రులు పలువురు ఇందులో కూరుకుపోయారు. చివరకు లిక్కర్ కేసులో కేజ్రీవాల్ జైలుకు వెళ్లి వచ్చారు. ఈ క్రమంలో 2020లో వచ్చిన ఫలితాలు ఇప్పుడు పునరావృత మవుతాయని చెప్పలేని పరిస్థితి ఢిల్లీలో నెలకొంది. 2019లో మాదిరి 2024లో కూడా బీజేపీ మరోసారి మొత్తం ఏడు లోక్‌సభ సీట్లు సాధించింది. దీన్ని బట్టి ఢిల్లీ ప్రజలు జాతీయ స్థాయిలో నరేంద్రమోదీనే ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నారని రెండోసారి రుజువైంది. కాని అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి కేజీవ్రాల్‌ను ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారని ఖచ్చితంగా చెప్పేందుకు తగిన కారణాలు కానరావడం లేదు. ఎందుకంటే అవినీతి వ్యవహారంతో కేజ్రీవాల్ ప్రతిభ మసకబారింది. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా స్వయంగా తన ప్రతిష్ఠ దిగజారిపోయేలా చేసుకుంది. ఏ అవినీతి పునాదిగా ఆయన పార్టీ అవతరించిందో ఆ అవినీతే కాలనాగులా ఆయననే చుట్టుముట్టుకుంది. తనకంటూ విలాసవంతమైన భవంతిని నిర్మించుకోవడమే కాదు, ప్రభుత్వ పథకాల్లో కూడా వాటా కొట్టేయడం గురించి విజిలెన్స్ నివేదికల్లో బయటపడింది. మొహల్లా క్లినిక్‌లలో నకిలీ పేషంట్లను సృష్టించారని, జరగని వైద్య పరీక్షలను జరిగినట్లు చూపించారని, నాణ్యత లేని మందులు సరఫరా చేశారని ఈ నివేదికలు వెల్లడించాయి. ఒకప్పుడు ఎలాంటి మచ్చాలేని ఆమ్ ఆద్మీ పార్టీ అవినీతి పాఠాలు వంటబట్టించుకుంది. అణగారిన వర్గాల నుంచి అవతరించిన పార్టీలకు కూడా అవినీతి చెదలు పట్టడం రాజకీయంగా దురదృష్టం. తెలంగాణ సాధనలో కెసిఆర్ ఎంతగానో పోరాడినా అవినీతి ఇప్పుడు ఆయన పార్టీని కూడా మింగేసింది. జగన్ అవినీతి రాజకీయాలు కూడా ఎపిలో వైసిపిని ముంచాయి. అవినీతికి సంబంధించి మాట్లాడితే ప్రజలు ఛీత్కరించే పరిస్థితి వచ్చింది. దీంతో ఇప్పుడు కేజ్రీవాల్ పతనం కూడా ఆశ్చర్యానికి గురిచేయదనే చెప్పాలి.

# సుప్రీం తీర్పుపైనే బిఆర్ఎస్ ఆశలు !

హైదరాబాద్,పార్టీలు మారడం తప్పే...ఒకపార్టీ నుంచి గెలిచిన వారు మరో పార్టీలోకి మారడం అన్నది సర్వసాధారణం అయ్యింది. రాజ్యంగం ప్రకారం కఠిన నిబంధనలు లేకపోవడంతో జంపింగ్ జిలానీలు ఉండనే ఉంటున్నారు. అధికారంలో ఉన్న పార్టీకి సహజంగానే దుంకేస్తున్నారు. ఇంతకాలంగా ఇది నడుస్తూనే ఉంది. తాజాగా తెలంగాణలో పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో లొల్లి మొదలయ్యింది. దీనిపై బిఆర్ఎస్ పోరాడుతూనే ఉంది. చివరకు సుప్రీంలో కేసు వేసింది. ఇంతకాలం ఎందుకు చర్య తీసుకో లేదని తాజాగా సుప్రీం ప్రశ్నించడంతో తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి ఆ పదిమందికి నోటీసులు ఇచ్చారు. లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలన్నారు. ఇదంతా ఒక ఎత్తయితే గతంలో ఎమ్మెల్యేను గంపగుత్తగా పార్టీలో చేర్చుకుని కాంగ్రెస్, టిడిపి, సిపిఐలను దెబ్బకొట్టిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీది. తెలంగాణ పునరేకీకరణ పేరుతో నిస్సిగ్గుగా ఎమ్మెల్యేలను గోడదాటించారు. ఆనాడు వారి చేసివుండకపోయి వుంటే..ఇవాళ బిఆర్ఎస్ వాదనకు బలం ఉండేది. నిజాయితీ ఉండేది. కానీ తొమ్మిదన్నరేళ్ల పాలనలో చేయని అరాచకం లేదు. తెలంగాణ రావడం ఆ కుటుంబం కోసమే అన్నట్లుగా పాలన సాగించారు. ఇష్టం వచ్చినట్లుగా అప్పులు చేసి, అభివృద్ధి ముసుగేశారు. దాదాపు 7 లక్షల కోట్లు అప్పులుచేసిన పెద్దాయన ఇప్పుడు అసెంబ్లీ మొహం చూడడం లేదు. ఫామ్‌హౌజ్ వీడి బయటకు రావడం లేదు. కేవలం ఆయన కొడుకు, కూతురు, అల్లుడు మాత్రమే రాజకీయాలు నడుపుతున్నారు. అసెంబ్లీలో కూడా అబద్దాలు చెప్పడం అలవాటు చేసుకున్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఉప ఎన్నికలకు సిద్దంగా ఉండండి అంటూ కెటిఆర్ పార్టీ శ్రేణులకు లీకులు ఇస్తున్నారు. తెలంగాణలో అధికారం కోల్పోయిన బిఆర్ఎస్, తరవాత పార్లమెంట్ ఎన్నికల్లో పూర్తిగా చతికిల పడ్డది. విజయం సాధించక పోవడంతో పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. పదిమంది పోయారనని సరిపెట్టుకోవడానికి కూడా లేదు. గతంలో టిఆర్ఎస్ ఆడిన విధంగానే కాంగ్రెస్ కూడగా పాచికలు వేస్తోంది. బిఆర్ఎస్‌ను బొందపెట్టడమే లక్ష్యంగా కాంగ్రెస్, బిజెపిలు పావులు కదుపుతున్నాయి. ఎందుకంటే ఇప్పటికే అనేకమంది బిఆర్ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఎమ్మెల్యేలు జారుకుంటున్నారు. అధికారంలో లేకున్నా ఎపిలో విపక్షంగా టిడిపి ఉన్నా బలంగా నిలబడి తిరిగి అధికారం దక్కించుకుంది. అక్కడ జగన్ ఎన్ని విధాలుగా వేధించినా నేతలు, కార్యకర్తలు టిడిపిని వీడలేదు. కానీ బిఆర్ఎస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదు. ఒక కటుఉంబం చేతిలో పార్టీ ఉండిపోయింది. పదేళ్లు అధికారంలో ఉన్నా కుటుంబ పాలన వల్ల బిఆర్ఎస్ అధికారం కోల్పోయింది. అనేక అక్రమాలను మూటకట్టుకుంది. అవే ఇప్పుడు యమపాశాలై వెన్నాడుతున్నాయి. ఓటమి తరవాత ఇక్కడ బిఆర్ఎస్, ఎపిలో వైసిపి ఒకే తరహా డ్రామాలు ఆడుతున్నాయి. ఎమ్మెల్యేలను లేదా ఎంపిలను లేదా క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను చేర్చుకోవడంలో తెలంగాణలో పోటీ కేవలం కాంగ్రెస్, బిజెపిల మధ్యనే ఉంది. ఈ రెండు పార్టీలు ఆధిపత్యం లక్ష్యంగా పెట్టుకుని పోరాడుతున్నాయి. దీంతో విపక్ష బిఆర్ఎస్‌లో చేరేందుకు ఎవరు కూడా ముందుకు రావడం లేదు. పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీ ఇంతగా ప్రజల్లో ఆదరణ కోల్పోవడం కేవలం బిఆర్ఎస్‌లో మాత్రమే కనిపిస్తోంది. ఈ క్రమంలో



వచ్చే స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ అత్యధిక సర్పంచ్ సీట్లు గెలిస్తేనే రాజకీయంగా నిలుస్తుంది. అందుకే మైండ్ గేమ్ ఆడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా బీఆర్ఎస్ చతికిల బడటం, కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగు తున్న విచారణ, ఎమ్మెల్సీ కవిత మద్యం కుంభకోణంలో జైలుకు వెళ్లడం, ముఖ్యనేతలు అనుకున్న వారంతా కారు దిగి హస్తం పార్టీలోకో, బీజేపీ గూటికో చేరడం వంటి పరిణామాలతో గులాబీ పార్టీ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. దీంతో పార్టీ క్యాడర్లో జోష్ నింపేందుకు కేటీఆర్ నిత్యం ఏదో ఒక విధంగా అబద్దాల ప్రచారం అందుకున్నారు. తమ పదేళ్లలో చేయలేని పనులను ఇప్పుడు ప్రస్తావిస్తున్నారు. తమ దోపిడీ రాజ్యాన్ని ప్రజలు మరచి పోయేందుకు డ్రామాలు ఆడుతున్నారు. ఈ క్రమంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయించేందుకు సుప్రీంలో కేసు వేసి పోరాడుతున్నారు. పార్టీ మారడం నైతికంగా తప్పే. సుప్రీం దీనిని గుర్తించి తీర్పును ఇస్తే వచ్చే తరాలకు ఇది..ఓ గుణపాఠం కానుంది. ఇదంతా రానున్న వారం రోజుల్లో తేలుతుందా అన్నది చూడాలి. ఇకపోతే అసెంబ్లీ సమావేశాలకు ఇక్కడ కెసిఆర్, అక్కడ జగన్ హాజరు కావడం లేదు. ఇలా హాజరుకాని వారిని ఎమ్మెల్యేలగా ఎందుకు పరిగణించాలో కూడా చట్టంలో చెప్పలేదు. అందువల్ల దీనిపైనా చర్చ చేయాల్సి ఉంది. అసెంబ్లీకి ఎందుకురారో చెప్పడం లేదు. కెసిఆర్, జగన్ అసెంబ్లీ సమావేశాల్లో కీలకంగా వ్యవహరిస్తారని అంతా అనుకున్నారు. కానీ అలాంటిదేమీ జరగలేదు. అసెంబ్లీ ద్వారా ప్రజల్లో ఉండేందుకు వచ్చిన అవకాశాన్ని వదులుకున్నారు. త్వరలోనే పెద్ద బహిరంగ సభ పెట్టి కాంగ్రెస్‌ను కడిగి పారేస్తానని అంటున్నారు. అయితే ఇప్పటికిప్పుడు బిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. గులాబీ పార్టీని నిలుపుకునేందుకు మాజీ సీఎం ఆ పార్టీ అధినేత కేసీఆర్ రంగంలోకి దిగుతారని అనుకుంటున్నారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుందని బిజపి, బిఆర్ఎస్‌లు ప్రచారం చేస్తున్నా అది పెద్దగా ప్రజలు పట్టించుకునే స్థాయిలో లేదు. స్థానిక ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోతుందని కాంగ్రెస్ జోస్యం చెబుతోంది. బీఆర్ఎస్ దుకాణం బంద్ అవుతుందని, దాదాపు 25 మంది ఎమ్మెల్యేలు కారు దిగడం ఖాయమని ప్రచారం సాగుతోంది. బీఆర్ఎస్ లో నలుగురు మాత్రమే ఉంటారని, మిగతా వారంతా బయటకు రావడం ఖాయమని గులాబీ నేతలను మానసికంగా కృంగదీసేలా మంత్రులు తమ వ్యాఖ్యలు ముమ్మరం చేస్తున్నారు. అయితే స్థానిక ఎన్నికల్లో బలాబలాలు ఎలా ఉంటాయన్నది చూడాలి. అలాగే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై సుప్రీం తీర్పు ఎలా ఉంటుందో చూడాలి.

# ప్రజలపై భారం వేయలేమన్న బాబు నిర్ణయం సమర్ధనీయం




విజయవాడ, 'ప్రపంచం మారుతుంది-చంద్రబాబు కూడా మారాలని, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ప్రజలు చాలా ఇబ్బందుల్లో ఉన్నారనీ, వారిపై ఎలాంటి భారాలను వేయలేమని ఏపీ సీఎం చంద్రబాబు చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని వాడుకున్న జాతీయ, అంతర్జాతీయ కంపెనీలపై ట్యాక్సులను వేయాలని డిమాండ్ చేశారు. అప్పుడు రాష్ట్రానికి బోలెడంత ఆదాయం వస్తుందన్నారు. ప్రభుత్వ రంగాన్ని బలపరుచుకోవాలన్నారు. బుధవారం ఉదయం విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ..పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ముందుగా వచ్చిన ఆర్థిక సర్వే .. ప్రజల ఆర్థిక శక్తి పడిపోతుందని, ప్రజలిక భారాలను భరించగలిగే స్థితిలో లేరని తెలిపిందన్నారు. ప్రజలు అప్పుల్లో ఉన్నారని, వారిక భారాలను భరించలేరన్న విషయాన్ని పార్లమెంటులో బ్జడెట్‌ను ప్రవేశపెట్టక ముందే చంద్రబాబు గుర్తించి ఉంటే బాగుండేదన్నారు. ప్రస్తుతం భారతదేశంలో పెట్టుబడులన్నీ వెనక్కు వెళ్లిపోతున్నాయన్నారు. షేరు మార్కెట్లు తగ్గిపోతున్నాయని అన్నారు. అంతర్జాతీయ ఆర్థిక మాంద్యపు ప్రభావం నేడు భారతదేశంపై పడుతుందన్నారు. భారతదేశం అంతర్జాతీయ మార్కెట్‌లోకి వెళ్లి బ్రహ్మాండమైన అభివృద్ధిని సాధిస్తుందని, 8 శాతం అభివృద్ధి సాధిస్తామని మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన మాటలన్నీ భోగస్సేనన్నారు. కేవలం కార్పొరేట్ శక్తులకు బలాన్నివ్వడం కోసం చెబుతున్న మాటలే తప్ప ఎలాంటి వాస్తవం లేదన్న విషయాన్ని ఆర్థిక సర్వే తేటతెల్లం చేసిందని వివరించారు. ఇప్పుడు ప్రజలపై ఇక అదనపు భారాలు వేయలేమని చంద్రబాబు చెప్పారని, అయితే ప్రజలు అప్పుల భారాల్లో ఉన్నారని, అదనపు భారాలను భరించలేరని వామపక్షాలు ముందుగానే గత నవంబర్ నెలలోనే చెప్పినట్లు శ్రీనివాసరావు గుర్తు చేశారు. కానీ ఆ రోజుల్లో చంద్రబాబు మాట్లాడుతూ ? మామూలు స్టేట్ రోడ్లకు కూడా ట్యాక్స్ వేయాలని అన్నారని గుర్తు చేశారు. ఖజానా ఖాళీగా ఉందని, ఒక శాతం జిఎస్‌టి పెంచుతామని వీటన్నిటిపై సెంట్రల్‌కు ప్రతిపాదన కూడా వారు పంపారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఖజానానే ఖాళీగా ఉన్నప్పుడు? ప్రజల ఖజానా ఏమైనా నిండుగా ఉందా ? అని ప్రశ్నించారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు పెంచుతున్నారని, చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రజలపై భారం మోపారని విమర్శించారు. గతంలో ఎన్నడూ ఇలా వరుసగా 3 సార్లు జనాలపై ఇలా ట్రూఅప్ ఛార్జీలను వేయలేదని చెప్పారు. ప్రజలు అప్పుల్లో ఉన్నారని, ట్రూ అప్ ఛార్జీలను ప్రజలు భరించలేరని గతంలోనే వామపక్షాలు స్పష్టం చేశాయన్న సంగతిని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వాస్తవాన్ని గుర్తించి ప్రజలపై భారాలు వేయలేము అని చెప్పడాన్ని తాము స్వాగతిస్తున్నామ న్నారు. ప్రభుత్వ ఆస్తులమ్మి ఖజానాను నింపుకుంటామంటే దాన్ని ఏమాత్రం సమ్మతించబోమని స్పష్టం చేశారు. రాష్ట్రానికి కేంద్రం నుండి రావల్సిన వనరులున్నాయని, రూ.20 వేల కోట్లు ఇప్పటికే కేంద్రం ఏపీ రాష్ట్రానికి బకాయి ఉందని తెలిపారు. పోలవరానికి కేంద్రం కేవలం డ్యాం కట్టడానికి నిధులిస్తుంది కానీ పునరావాసానికి ఇవ్వడం లేదని చెప్పారు. 2013 చట్టం ప్రకారం ? పునరావాసానికి ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకుండా చేస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్లకు నిధులను రెన్యువల్ చేస్తున్నారు కానీ పునరావాసానికి మాత్రం పదేళ్ళనాటి పద్ధతినే అనుసరించడం న్యాయం కాదన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికీ పునరావాసాన్ని అప్‌డేట్ చేసి రూ.10 లక్షలకు తగ్గకుండా ఇవ్వాలని, వారికి ఇండ్లు, ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు, ఆదివాసీలకు ఇవ్వాల్సిన పూర్తిస్థాయి భద్రతను ఇస్తేనే పోలవరం పూర్తవుతుందని, పునరావాసం పూర్తవుతుందని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కేంద్రం నుండి రావల్సిన రెవెన్యూ లోటు భర్తీ, కడప ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు, చట్ట ప్రకారం రాష్ట్రానికి రావల్సిన ప్యాకేజీలను, ప్రత్యేక హోదాను సాధించాలని కోరారు. రాష్ట్రంలో కడప ఉక్కు ఫ్యాక్టరీని బలపరిస్తే ప్రజలకు ఉపాధి దొరుకుతుందని, కొనుగోలు శక్తి పెరుగుతుందని, అప్పుల నుండి కోలుకుంటారని అన్నారు. డీఎస్సీ సీట్లు భర్తీ చేయాలన్నారు. ప్రజలపై అదనపు భారాలను వేయబోమని చెప్పడమే కాదు కానీ ప్రజల ఆదాయ మార్గాలను పెంచే చర్యలను ప్రభుత్వం చేపట్టాలని శ్రీనివాసరావు కోరారు. కేంద్రంతో పోరాడి రాష్ట్రానికి రావల్సిన నిధులన్నిటినీ తీసుకురావాలని ఆశించారు. .ప్రజలపై కాదు సెలక్టివ్ కార్పొరేట్లపై పన్ను భారం పెంచాలని అన్నారు. జిఎస్‌టి పెంచి సామాన్యులపై భారం పెంచవద్దని అన్నారు. రాష్ట్ర వనరులను వాడుకుంటున్న కార్పొరేటర్లు ఎందుకు మనకు డబ్బివ్వరని నిలదీశారు. అమెరికాతో సహా ప్రపంచ దేశాలన్నీ ప్రభుత్వ రంగాలను బలపరుచుకుంటున్నాయని తెలిపారు. కమ్యూనిస్టులు కాదు.. చంద్రబాబు నాయుడు మారాలని చెప్పారు. ఇది 2000 వ సంవత్సరం కాదని, నేడు ఎకానమీ గ్రీనరీగా లేదని అన్నారు. సంక్షోభంలో ఉన్న ప్రపంచం పరుగెత్తుకొచ్చి ఇక్కడ పెట్టుబడులు పెట్టబోరన్న సంగతి చంద్రబాబు గుర్తించాలన్నారు. ప్రభుత్వ రంగాన్ని బలపరుచుకోవడమే ప్రధాన కర్తవ్యమన్నారు. కమ్యూనిస్టు దేశాలు డెవలవ్ అవుతున్నాయని, పలు దేశాలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని, ప్రపంచం మారుతుందని చంద్రబాబు గుర్తించాలన్నారు. దానికనుకూలంగా విధానాలను మార్చుకోవాలని సూచించారు. విజన్ 2047 ఆకాశంలో మబ్బులాంటిదని, మబ్బులను చూసి ముంతలో నీళ్లను పారబోసుకోకూడదని చెప్పారు. ఏపీలోని పెట్టుబడిదారులు వేరే దేశాల్లో పెట్టుబడులు పెట్టడం కంటే మన రాష్ట్రంలోనే పెట్టుబడులు పెట్టేలా చేయాలని కోరారు. మన రాష్ట్రంలో సంపాదించిన సొమ్మును వారు విదేశాల్లో ఎలా పెడతారు ? అని ప్రశ్నించారు. దేశ భక్తి ప్రజలకేనా ? పెట్టుబడిదారులకు లేదా ? అని అడిగారు. విదేశాల్లో తాకట్టు పెట్టడానికా దేశ భక్తి ? ప్రజల కోసం-దేశాభివృద్ధి కోసమా దేశ భక్తి ? చెప్పాలని నిలదీశారు. ఇక్కడ పెట్టుబడిదారులకు రాయితీలు ఇచ్చి ఇతర దేశాలకు పంపడం శోచనీయమన్నారు. ప్రజలపై ఎలాంటి భారాలను వేయబోనని చెప్పిన సీఎం చంద్రబాబు ? దాంతోపాటు ప్రకృతి వనరులను కాపాడాలని, కార్పొరేట్లపై భారం వేసి ఆ రాయితీలను ప్రజలకు ఇవ్వాలని అన్నారు. అప్పుడు ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని, తద్వారా ఉపాధి పెరుగుతుందని, అప్పుడు రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# టీజీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలకు మార్గం సుగమం

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రంలో టీజీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలకు మార్గం సుగమమైంది. ఈ ఫలితాల విడుదలకు అడ్డుగా ఉన్న రెండు కేసులను సుప్రీంకోర్టు కొట్టేసింది. దీంతో వచ్చే 10, 12 రోజుల్లోనే గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలను విడుదలకానున్నాయి. ఈ మేరకు టీజీపీఎస్సీ కసరత్తు చేస్తుంది. జీవో 29ను సవాలు చేయడంతోపాటు వికలాంగుల రిజర్వేషన్ అంశాలపై పలువురు గ్రూప్ 1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దానిపై టీజీపీఎస్సీ కేవియట్ పిటిషన్ దాఖలు చేయగా.. ఇటీవల అత్యున్న ధర్మాసనం విచారణ జరిపి అభ్యర్థుల పిటిషన్లను కొట్టివేసింది. దీంతో గ్రూప్ 1 ఫలితాల విడుదలకు అన్ని అడ్డంకులు తొలగినట్లైంది. తెలంగాణ రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఐసెట్ 2025 నోటిఫికేషన్ మార్చి 6న విడుదల కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి వెల్లడించింది. నోటిఫికేషన్ విడుదల తర్వాత మార్చి 10 నుంచి దరఖాస్తులు స్వీకరన చేపడతారు. టీజీ ఐసెట్ సెట్ కమిటీ సమావేశాన్ని సోమవారం మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించగా.. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఐసెట్‌కు మే 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక ఐసెట్ పరీక్షలు జూన్ 8, 9 తేదీల్లో ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మసీ వంటి పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ పీజీఈసెట్ నోటిఫికేషన్ మార్చి 12న విడుదల చేసేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుంది. మార్చి 17నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం అవుతాయి. సోమవారం కూకట్‌పల్లిలోని జేఎన్టీయూలో నిర్వహించిన సెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా పీజీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఏ అరుణకుమారి, కో కన్వీనర్ ప్రొఫెసర్ బీ రవీంద్రారెడ్డి పీజీఈసెట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు.

# స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

న్యూఢిల్లీ,స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ వెల్లడించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పై పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలనే ఉద్దేశంతోనే రూ.11,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించినట్లు లోక్‌సభ సాక్షిగా కేంద్ర మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్ అంశంపై లోక్ సభలో బీజేపీ ఎంపీ సీఎం రమేశ్, జనసేన ఎంపీ బాలశౌరి ప్రశ్నలు లేవనెత్తారు. ఈ మేరకు కేంద్ర మంత్రి భూపతి రాజు క్లారిటీ ఇచ్చారు. ప్లాంట్‌ను కాపాడేందుకే రూ.11,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఆమోదించినట్లు ఆయన స్పష్టం చేశారు. సంస్థని రక్షించుకోవాలనే ఆలోచనతోనే కేంద్రం వేల కోట్ల ప్రకటించి ముందడుగు వేసినట్లు చెప్పుకొచ్చారు. విశాఖ స్టీల్ ప్లాంట్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని, మొత్తం అప్పులు, బకాయిలు, రుణాలు సహా రూ.38,965 కోట్ల నష్టాల్లో సంస్థ ఉందని కేంద్రమంత్రి భూపతిరాజు వెల్లడించారు. ఉద్యోగులకు జీతాలు చెల్లింపులోనూ సంస్థకు ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. 2024 సంవత్సరానికి సంబంధించి సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో ఉద్యోగులకు కొద్దిమేర మాత్రమే వేతనాలు చెల్లించినట్లు ఆయన చెప్పారు. 2024 ఏప్రిల్, డిసెంబర్ మధ్య సంస్థ రూ.12,615 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందని, అయినా రూ.3,943 కోట్ల నష్టాన్ని చవిచూసిందని కేంద్రమంత్రి వెల్లడించారు. సంస్థ గురించి ఆందోళన చెంది, దాన్ని పరిరక్షించేందుకు ప్రత్యేక ప్యాకేజీతో చర్యలు చేపట్టినట్లు భూపతిరాజు చెప్పుకొచ్చారు.

# అంతరిక్షంలోనే చిక్కుకున్న సునీతా విలియమ్స్

న్యూమార్క్,జీరో గ్రావిటీ వద్ద కొన్ని నెలలుగా తేలియాడుతుండటంతో నేలపై నడిచిన అనుభూతిని గుర్తు తెచ్చుకోలేకపోతున్నానని సునీతా విలియమ్స్ ఇటీవల చెప్పారు. ఆమె ఆరోగ్యం కూడా విషమించిందన్న వార్తలు వచ్చాయి. ఆమెను తిరిగి భూమి మీదకు రప్పించే ప్రయత్నాలపై అనుమానాలు వస్తున్నాయి. తమ మిషన్ ప్రకారం నెల రోజుల్లోపే అంతరిక్షం నుంచి తిరిగి రావాలి. కానీ, ఇంతకాలం ఇక్కడ ఉండటం కొంచెం షాకింగ్‌గా అనిపిస్తోందనీ అన్నారు. సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ గతేడాది జూన్ 6న బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సుల్‌లో అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. వాస్తవానికి అదే నెల 14వ తేదీన వీరిద్దరూ భూమికి తిరుగు పయనం కావాల్సి ఉండగా.. వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. దీంతో ఇద్దరూ ఏడు నెలలుగా అంతరిక్ష కేంద్రంలోనే చిక్కుకుపోయారు. అంతరిక్షంలో చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌లను సురక్షితంగా భూమ్మీదకు తీసుకురావాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ సాయం కోరినట్లు 'స్పేస్ ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్ అన్నారు. త్వరలో ఈ పనిని పూర్తిచేస్తామని 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. వారిద్దరినీ తిరిగి భూమి పైకి తీసుకువచ్చేందుకు బైడెన్ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని.. వారు చేసిన ఆలస్యం వల్ల వ్యోమగాములు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని విమర్శించారు.

# చైనా సుంకాలపై దీటుగా స్పందించిన చైనా

బీజింగ్, అమెరికా విధించిన టారిఫ్‌లపై చైనా ప్రభుత్వం ధీటుగా స్పందించింది. అమెరికా నుండి దిగుమతయ్యే బొగ్గు, ఎల్ఎన్‌జి ఉత్పత్తులపై 15శాతం, ముడి చమురు, ఇతర ఉత్పత్తులపై పది శాతం సుంకాలను విధిస్తున్నట్లు చైనా ప్రభుత్వం తెలిపింది. కెనడా, మెక్సికో, చైనా దేశాల వస్తువులపై దిగుమతి సుంకాలను విధిస్తూ వాణిజ్య యుద్దానికి ట్రంప్ తెరలేపిన సంగతి తెలిసిందే.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా అధిక టారిఫ్‌లను విధించడం ప్రపంచ వాణిజ్య సంస్థ డబ్ల్యుటిఒ నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ చర్య అమెరికా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోగా చైనా, అమెరికాల మధ్య నెలకొన్న ఆర్థిక, వాణిజ్య సంబంధాలను దెబ్బతీస్తుందని తెలిపింది. చైనా దిగుమతులపై ట్రంప్ విధించిన 10శాతం సుంకాలు మంగళవారం నుండి అమల్లోకి రానున్నాయి. యాంటీ ట్రస్ట్ చట్టాలను ఉల్లంఘిస్తోందనే అనుమానంతో అమెరికా టెక్ సంస్థ గూగుల్‌పైనా దర్యాప్తు చేపట్టినట్లు చైనా స్టేట్ అడ్మినిస్ట్రేషన్ ఫర్ మార్కెట్ రెగ్యులేషన్ మంగళవారం పేర్కొంది. ట్రంప్ ఆదేశాలు అమల్లోకి వచ్చిన కొద్ది నిమిషాల తర్వాత చైనా ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది.

# భక్తుల టూరిజం కార్పొరేషన్ ప్రత్యేక ప్యాకేజీ

హైదరాబాద్, ఈ నెల 26వ తేదీన మహా శివరాత్రి. ఈ పర్వదినం సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తుతుంటాయి. భక్తుల కోసం ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ మరో ప్యాకేజీని ప్రకటించింది. అయోధ్య- కాశీ పుణ్యక్షేత్ర యాత్ర, జ్యోతిర్లింగ దర్శనం ప్యాకేజీని ప్రకటించింది. భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఆయా పుణ్యక్షేత్రాలను భక్తులు దర్శించుకోవచ్చు. ఎనిమిది రాత్రులు/తొమ్మిది పగళ్ల సాగే యాత్ర ఇది. ఈ నెల 28వ తేదీన సికింద్రాబాద్ నుంచి భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరి వెళ్తుంది. మొత్తం 718 సీట్లు అందుబాటులో ఉంటాయి. ఇందులో స్లీపర్- 460, 3ఏసీ- 206, 2ఏసీ- 52 సికింద్రాబాద్ నుంచి బయలుదేరి ఖాజీపేట్, వరంగల్, ఖమ్మం, ఏపీలోని విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలాస, ఒడిశాలోని బ్రహ్మపూర్, ఖుర్దారోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలేశ్వర్ స్టేషన్లల్లో ఈ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ సౌకర్యం ఉంది. ఈ ప్యాకేజీలో గయ- వారణాశి- అయోధ్య- ప్రయాగ్ రాజ్ ఉన్నాయి. గయలో విష్ణుపాద ఆలయం, వారణాశిలో కాశీ విశ్వనాథుడు, అక్కడే కారిడార్, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణ దేవి ఆలయాలను సందర్శించవచ్చు. అయోధ్యలో శ్రీరామచంద్రులవారి ఆలయం, హనుమాన్ గఢ్జి, హారతి, అత్యంత ప్రాచీనమైన సరయూ నదిని దర్శించవచ్చు. ప్రయాగ్ రాజ్‌లో త్రివేణి సంగమంలో మహా కుంభమేళా పుణ్యస్నానాలను ఆచరించడంతో ఈ ప్యాకేజీ టూర్ ముగుస్తుంది. ప్రయాగ్ రాజ్ నుంచి మళ్లీ సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్. ఈ ప్యాకేజీ కోసం ఒక్కొక్కరు చెల్లించాల్సిన ఛార్జీ మొత్తం 14,390 రూపాయలు. ఇది ఎకానమీ అంటే స్లీపర్ క్లాస్. ఇందులో పిల్లలు అంటే 5 నుంచి 11 సంవత్సరాల్లోపు వారికి 13,495 రూపాయల ఛార్జీని నిర్ధారించారు. థర్డ్ ఏసీలో పెద్దలకు 23,600, పిల్లలకు 22,550 రూపాయలు, సెకెండ్ ఏసీ పెద్దలకు 31,160, పిల్లలకు 29,990 రూపాయలను చెల్లించాల్సి ఉంటుంది. దేశంలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలను అనుసంధానిస్తూ రైల్వే మంత్రిత్వ శాఖ.. భారత్ గౌరవ్ పేరుతో ఈ ప్రత్యేక రైళ్లను నడిపిస్తోన్న విషయం తెలిసిందే. వీటికి ప్రయాణికుల నుంచి అద్భుత స్పందన లభిస్తోంది. ప్రారంభమైనప్పటి అన్ని ట్రిప్పుల్లో కూడా ప్రయాణికుల ఆదరణ భారీగా ఉంటోంది. వాటి ట్రిప్‌ల సంఖ్యను పెంచుతోంది.

# సెల్లార్ తవ్వుతుండగా పైనుంచి పడ్డ మట్టిదిబ్బలు

హైదరాబాద్,నగరంలోని ఎల్బీనగర్‌లో సెల్లార్ తవ్వకాల్లో అపశృతి చోటు చేసుకుంది. సెల్లార్ లోపల పనిచేస్తుండగా పైనుంచి మట్టిదిబ్బలు కుప్పకూలాయి. ఈ క్రమంలో మట్టిదిబ్బలు పడటంతో ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మట్టిదిబ్బల కింద నుంచి మూడు మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే రెండు గంటల పాటు శ్రమించిన తర్వాత అతికష్టం మీద మూడు మృతదేహాలను వెలికితీశారు. మృతి చెందిన ముగ్గురు బీహార్‌కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. మృతులు వీరయ్య, వాసు, రాములుగా తెలుస్తోంది. ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఒక్కసారిగా సెల్లార్‌లో మట్టిదిబ్బలు కూలి పెద్ద శబ్దం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మృతుల్లో ఇద్దరు తండ్రి, కొడుకులు ఉన్నట్లు గుర్తించారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో పనిచేసే ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. అయితే సెల్లార్ తవ్వకాలు జరుపుతున్న సమయంలో జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే సెల్లార్ తవ్వే క్రమంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. గత కొంతకాలంగా ఈ అపార్ట్‌మెంట్ నిర్మాణం జరుగుతున్న క్రమంలో పెద్ద ఎత్తున సెల్లార్ కోసం తవ్వకాలు చేపట్టారు. రాత్రి సమయంలో పెద్ద ఎత్తున పేలుళ్లు జరుపుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారు పట్టించుకోని పరిస్థితి. ఈ సెల్లార్లన్నీ కూడా 40 అడుగుల లోతులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇంత పెద్దఎత్తున సెల్లార్ల తవ్వకం చేస్తున్నప్పటికీ కూడా జీహెచ్ఎంసీ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించారని.. జీహెచ్ఎంసీ అధికారులు పర్మిషన్లు ఇవ్వడం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.

# రంగంలోకి ఐప్యాక్ టీమ్..!

హైదరాబాద్,ఐప్యాక్.. దేశంలో పేరున్న పొలిటికల్ కన్సల్టెన్సీ టీమ్. గతంలో ఐప్యాక్ చాలా పార్టీలకు, చాలా రాష్ట్రాల్లో పని చేసింది. 2019, 2024 ఎన్నికల్లో వైసీపీ తరఫున జగన్ కోసం ఏపీలో గ్రౌండ్ వర్క్ చేసింది. ఆ ప్రాసెస్‌లో 2019లో వైసీపీ ఘనవిజయం సాధించింది. కానీ..2024లో మాత్రం ఘోరంగా ఓడిపోయింది. వైసీపీ గెలిచినప్పుడు క్రెడిట్ ఐప్యాక్‌కు ఎంత వచ్చిందో తెలియదు కానీ..మొన్నటి ఎన్నికల్లో వైసీపీ ఓడిపోనప్పుడు మాత్రం ఫ్యాన్ పార్టీ నేతలు, జగన్ అభిమానులు అంతా ఐప్యాక్ టార్గెట్‌గా విమర్శలు చేశారు.ఐప్యాక్ కారణంగానే వైసీపీ ఘోరంగా ఓడిపోయిందని మండిపడ్డారు. 2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమికి ఎన్ని కారణాలు ఉన్నా..ఎక్కువ వేళ్లు మాత్రం పొలిటికల్ కన్సల్టెన్సీ ఐప్యాక్ వైపే చూపించాయి. కొందరు వైసీపీ నేతలు అయితే మీడియా ముందే ఐప్యాక్‌పై విమర్శలు చేశారు. ఐప్యాక్‌ను తీసుకొచ్చి తమ నెత్తిమీద పెట్టారంటూ బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేశారు.ఐప్యాక్ టీమ్ సలహాలు, సూచనల ఆధారంగానే ముందుకెళ్లాలని..ఐప్యాక్ సర్వేలో పాజిటివ్ రిపోర్ట్ రాకపోతే టికెట్ ఇవ్వబోమన్న జగన్ మాటలు కొందరు లీడర్లకు ఏ మాత్రం నచ్చలేదు. టికెట్ల మార్పునకు కూడా ఐప్యాక్ టీమే కారణమని ఇప్పటికి రగిలిపోతున్నారు నేతలు. ఈ నేపథ్యంలో జగన్ కోసం ఐప్యాక్ మళ్లీ పనిచేయబోతోందనే వార్త హాట్ టాపిక్‌గా మారింది.

వైసీపీ ఓడిపోయిన తర్వాత ఐప్యాక్ టీమ్ సైలెంట్

గత ఏడాది మే నెలలో ఎన్నికలు అయిపోయాయి. జూన్ నెలలో ఫలితాలు వచ్చాయి. వైసీపీ ఓడిపోయిన తర్వాత ఐప్యాక్ టీమ్ సైలెంట్ అయ్యింది. కానీ లేటెస్ట్‌గా పొలిటికల్ సర్కిల్స్‌లో ఓ వార్త చక్కర్లు కొడుతోంది. ఐప్యాక్ టీమ్ మళ్లీ జగన్ కోసం ఏపీలో పని చేయబోతోందని వైసీపీ నేతలు చెబుతున్నారు. అయితే ఎన్నికల ఫలితాల తర్వాత ఓ మాజీ మంత్రి మీడియా ముందుకు వచ్చి..తమ పార్టీ ఓటమికి ఐప్యాక్ టీమ్ కారణమని ఆరోపించారు. ఆయనే కాదు..చాలామంది నేతలు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సిచ్యువేషన్‌లో ఐప్యాక్ మళ్లీ రీఎంట్రీ ఇవ్వబోతుందన్న టాక్..అటు వైసీపీలోనే కాదు..ఇటు ఏపీ రాజకీయాల్లో కూడా చర్చనీయాంశంగా మారిందట.ఈ నెలాఖరు లేదా..మార్చి ఫస్ట్ వీక్ నుంచి ఐప్యాక్ వైసీపీ కోసం మళ్లీ ఫుల్ ఫ్లెడ్జ్‌గా యాక్టివిటీ

# కుల గణనతో దేశంలో పెను విస్ఫోటనం!

హైదరాబాద్,దశాబ్దాలుగా మేధావులు, రాజకీయ నాయకులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్న సమగ్ర కుల గణనను తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయ వంతం చేసింది. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు హామీల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కృతకృత్యురాలవడం దేశంలోని వెనుకబడిన వర్గాలకు ఎంతో సంతోషాన్ని ఇచ్చే విషయం అనడంలో ఎంత మాత్రం సందేహం లేదు..బిహార్ రాష్ట్రంలో నితీష్ కుమార్ ప్రభుత్వం కుల గణన చేసినా కోర్టు ఉత్తర్వులతో ప్రభుత్వ ఆదేశాలు అమలు కాకపోవడంతో దేశంలోని మెజారిటీ వెనుకబడిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద మైనారిటీ వర్గాలు తీవ్ర నిరాశకు గురయినాయి. రాహుల్ గాంధీ స్వయంగా తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని నియంత్రిస్తూ కులగణన విజయవంతం అయ్యేలా చూడటం ఈ వర్గాలను ఆనందంలో ముంచెత్తింది.


జన గణనలో కుల గణన అంటూ..

2022 సెప్టెంబర్ 20న మొదలైన రాహుల్ గాంధీ జోడో యాత్రలో భాగంగా అనేక చోట్ల చేసిన ప్రసంగాల్లో కుల గణన గురించి ప్రస్తావించారు. 90 సంవత్సరాల తర్వాత కుల గణన ద్వారా ఈ కులాల స్థితిగతులను సమగ్రంగా విశ్లేషించి వీరి అభ్యున్నతికి వివిధ ప్రణాళికలు తయారు చేసి దేశాన్ని అభ్యుదయ మార్గంలో నడపడానికి వీలు పడుతుందని ఆయన పదేపదే పేర్కొంటూ వచ్చారు. ప్రతిపక్ష పార్టీ నేత, ఇండియా కూటమి ఇచ్చిన వత్తాసుతో వెనుకబడిన వర్గాల నాయకులు బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి పెంచడంలో విజయవంతం కావడం ఇక్కడ గమనించదగ్గ విషయం. 2011లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడంలో బీజేపీ సహా ఎన్డీఏ పార్టీలు సఫలీకృతులయ్యారు. అప్పట్లోనే సోషల్ ఎకనామిక్ సర్వే చేసిన ఆ పార్టీ అధికారం కోల్పోవడంతో.. అధికారం చేపట్టిన బీజేపీ, ఎన్డీఏ పార్టీలు కప్పదాట్లు వేస్తూ కుల గణనను దాచి తుంగలో తొక్కాయి. 2014 నుండి వివిధ వర్గాల నుండి వస్తున్న ఒత్తిడికి తలవంచి 2019 ఎన్నికల్లో సులువుగా గెలవడం కోసం జన గణనకు బడ్జెట్లో సుమారు 8700 కోట్లు కేటాయించి వెనుకడిన వర్గాలను జనగణనలో కుల గణన పేరిట బుజ్జగించి అధికారం చేజించుకున్నాయి.

కుల గణనపై ససేమిరా అంటున్న ఎన్డీఏ

2020 జనవరిలో వచ్చిన కరోనా నేపథ్యంలో ఈ అంశాన్ని విజయవంతంగా ఎన్డీఏ ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. అలాగే అనేక వంకలు చెప్పుకుంటూ 2024 ఎన్నికల నేపథ్యంలో జన గణన వాయిదా వేశామని, ఎన్నికల అనంతరం మొదలు పెడతామని వెనుకబడిన వర్గాల్లో ఆశలు రేకెత్తించింది. అగ్రవర్ణాల నాయకత్వంలోని బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఒత్తిడి నేపథ్యంలో దేశంలో ప్రతి 10 ఏళ్లకు తప్పక నిర్వహించవలసిన జన గణనను నిర్విరామంగా వాయిదా వేస్తుండటం శోచనీయం. 2021లో ముగించాల్సిన జన గణనను ఐదు ఏళ్లు గడిచినా చప్పుడు చేయడం లేదు. 146 కోట్ల భారత ప్రజల కోసం జన గణన మొదలుపెట్టక ఐక్యరాజ్యసమితి దృష్టిలో చులకన అవుతున్నాయి. దేశంలోని అన్ని వర్గాలూ ఎన్డీఏ తీరు చూసి నివ్వెరపోతున్నారు.

రాష్ట్రంలో కుల గణన సర్వే సక్సెస్!



ఈ నేపథ్యంలో 2020 సెప్టెంబర్‌లో నేను స్వయంగా సుప్రీంకోర్టు తలుపులు తట్టగా ఇదే ఎన్డీఏ ప్రభుత్వం 78 పేజీల తన అఫిడవిట్‌లో భారతదేశంలో జన గణన కుల గణన అసాధ్యమని దాని వల్ల భారత దేశ సమగ్రత దెబ్బతింటుందని చెప్పడం దేశంలోని మెజారిటీ వెనుకబడిన వర్గాలను ఆశ్చర్యపరిచింది. కేవలం వెనుకబడిన వర్గాలను వెంటాడుతున్న కుల పరమైన వెనుకబాటుతనాన్ని తెలుసుకోవడం తద్వారా నివారణ చర్యలు తీసుకునే వీలును కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకించడం దానిపై ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం షాక్ కలిగిస్తోంది. 2024 జనవరి నెలలో మళ్లీ రాహుల్ గాంధీ దేశంలోని అభ్యుదయ వర్గాలను ఉత్తేజపరిచిన నేపథ్యంలో, ఇండియా కూటమి గత సార్వత్రిక ఎన్నికల్లో దాదాపు ప్రభుత్వం ఏర్పాటుకు అతి చేరువకు చేరుకోవడం గొప్ప కీలక పరిణామం. జనవరి 12న ఢిల్లీలో భారత్ అభియాన్ నేతృత్వంలో జోడో న్యాయ యాత్ర సన్నాహక సమావేశంలో తెలంగాణ నుండి సభ్యుడిగా నేను పాల్గొని ఆ సమావేశంలో రాహుల్ గాంధీని కలిసి కులగణన అవసరంపై అభ్యర్థించాను. ఆయన క్షణాల్లో తెలంగాణ ముఖ్యమంత్రిని ఆదేశించడం, 2024 ఫిబ్రవరిలో శాసనసభ తీర్మానం చేయడం.. అన్నీ యుద్ధ ప్రాతిపదిక మీద జరిగి నేడు తెలంగాణ రాష్ట్రంలో కుల గణన సర్వే విజయవంతం కావడం, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించడం చకచకా జరిగిపోయాయి.

శాశ్వత పరిష్కారమే బెటర్!

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుపుతామని చెప్పడం అన్ని వర్గాల్లో ఆసక్తి కలిగించింది. కొన్ని పెట్టుబడిదారీ వర్గాల పత్రికలు రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ ఉందని హెచ్చరించాయి. కానీ కోటి ఆశలతో గెలిపించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమను పూర్తిగా సంతృప్తి పరుస్తుందని నమ్మకంతో తెలంగాణలోని వెనుకబడిన వర్గాలు ఆశతో ఎదురుచూస్తున్నాయి. 42 శాతం రిజర్వేషన్స్‌కి కేంద్ర అనుమతి అవసరం లేదు. రానున్న కొద్ది రోజుల్లో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికితే అందరూ ఊపిరి తీసుకుంటారనడంలో ఏమాత్రం సందేహం లేదు.

# ట్రంప్ టార్గెట్.. రూపాయిపై ఎఫెక్ట్.!




న్యూఢిల్లీ,రూపాయి ధమాల్.. డాలర్ జోరు.. గత కొన్ని రోజులుగా ఇదే న్యూస్. లోకల్ గా, ఇంటర్నేషనల్ గా అసలు ఏం జరుగుతోంది? వన్ డాలర్ ఈక్వల్ టు హండ్రెడ్ రుపీస్ అయినా ఆశ్చర్యపోనవసరం లేదా? ఇలాంటి డౌట్లు కూడా పెరుగుతున్నాయి. ప్రస్తుతం డాలర్ తో పోలిస్తే రూపాయి వాల్యూ ఆల్ టైమ్ కనిష్టానికి పడిపోయింది. ఒక్క డాలర్ 87 రూపాయలతో సమానమైంది. ఇలా జరగడం వల్ల కొంత వరకు లాభం.. చాలా వరకు నష్టం. మరి రూపాయి వాల్యూ పెంచుకునేదెలా? ఆర్బీఐ యాక్షన్ ప్లాన్ ఏంటి?డాలర్ చుట్టూ ప్రపంచం తిరుగుతోంది. కొన్ని దేశాల్లో లోకల్ కరెన్సీ ఎన్ని కోట్లయినా ఒక్క డాలర్ ముందు దిగదుడుపే. కొన్ని ఆఫ్రికన్ కంట్రీస్ కి ఎవరైనా ఫారినర్స్ వెళ్తే లోకల్ కరెన్సీ కంటే డాలర్లే కావాలంటారు. అట్లుంటది డాలర్ తోని. ఇంటర్నేషనల్ గా ఏ ప్రాబ్లమ్ వచ్చినా గిరాకీ పెరిగేది డాలర్ కే. యుద్ధాలైనా, రోగాలైనా.. పాండమిక్ అయినా, ఎండమిక్ అయినా.. ఏదైనా సరే అంతా అప్పుడు డాలర్, బంగారాన్నే నమ్ముకుంటారు. డాలర్ కు భద్రమైన, ఎక్కడైనా చెల్లే కరెన్సీగా నమ్మకం ఉండడం వల్లే ఇది జరుగుతోంది.డాలర్‌ను వదిలించుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా మనలాంటి దేశాలకు వర్కవుట్ కావడం లేదు. అయితే డాలర్‌పై అతిగా ఆధారపడాల్సిన పరిస్థితిని మాత్రం తగ్గించుకునే రూట్లు వెతుక్కునే పనిలో భారత్ సహా మరికొన్ని దేశాలు ఉన్నాయి. అలా చేసినా ట్రంప్ కు కోపం పెరుగుతోంది. ఆల్టర్నేట్ కరెన్సీ కోసం చూస్తున్న దేశాలను టార్గెట్ చేసి మరీ ఎక్కడ కొట్టాలో అక్కడే గురి చూసి కొడుతున్నారు ట్రంప్. ఇదంతా ఇంట్రొడక్షన్ ఇప్పుడెందుకంటే.. డాలర్ తో పోలిస్తే రూపాయి క్షీణత ఆల్ టైమ్ లో కు పడిపోయింది. ఇది ఎందుకు అన్నది ఇప్పుడు చూద్దాం.రూపాయి వాల్యూ పెరగాలన్నా, తగ్గాలన్నా కంటికి కనిపించేవి, కనిపించని ఫ్యాక్టర్స్ ఎన్నో బ్యాక్ గ్రౌండ్ లో పని చేస్తూ ఉంటాయి. ప్రెజెంట్ సిచ్యువేషన్ ఎలా ఉందంటే.. డాలర్ తో పోలిస్తే రూపాయి వాల్యూ తగ్గినా పరేషాన్%%% తగ్గకపోయినా పరేషాన్ అన్నట్లుగా ఉంది. ఎందుకంటే పడితే ఒకరికి లాభం. పెరిగితే మరొకరి భారం. చెప్పాలంటే ఇంటర్నేషనల్ ఇన్వెస్టర్ల మధ్య రూపాయి నలిగిపోతోంది. అందుకే ఇప్పుడు డాలర్ విలువ 87 రూపాయల 8 పైసలుగా నమోదైంది. ఇది రూపాయి చరిత్రలోనే ఆల్ టైమ్ లో. ఒక్క డాలర్ 87 రూపాయలు అంటే తేలిగ్గా తీసుకోవడానికి లేదు. రంగంలోకి దిగాల్సిన పరిస్థితే కనిపిస్తోంది. అమెరికన్ డాలర్ తో పోలిస్తే రూపాయి వాల్యూ ఇంతలా తగ్గడానికి చాలా కారణాలు ఉన్నాయి. ప్రెజెంట్ అయితే సిచ్యువేషన్ ను అబ్జర్వ్ చేస్తోంది ఆర్బీఐ. ఒక అంచనా ప్రకారం ఈ ఏడాది చివరి నాటికి ఒక డాలర్ వాల్యూ 90 రూపాయలకు చేరుతుందనీ అంటున్నారు. అలాగే సర్దుకుపోవడమా.. చక్రం తిప్పడమా అన్నది ఆర్బీఐ, మార్కెట్లు, ప్రభుత్వం చేతిల్లోనే ఉంటుంది. ఎందుకంటే అంతర్జాతీయ మార్కెట్ లో ఏ పని చేయాలన్నా డాలర్ల రూపంలోనే చేయాలి. సో మన రుపీస్ ను ఎక్కువగా ఖర్చు చేయాలి. దీంతో ఒత్తిడి సహజంగానే పెరుగుతుంది.ప్రెజెంట్ రుపీ సిచ్యువేషన్ ను కేంద్రం అబ్జర్వ్ చేస్తోంది. అమెరికా డాలర్ విలువ 87ను దాటినా ఎలాంటి టెన్షన్ అవసరం లేదని ఆర్థిక శాఖ కార్యదర్శి తుహిన్ కాంత పాండే అంటున్నారు. రూపాయి చుట్టూ జరుగుతున్న ఫ్యాక్టర్స్ పై ఆర్బీఐ ఫోకస్ పెంచిందంటున్నారు. డాలర్ తో పోలిస్తే రూపాయి ఎందుకు ఇంత క్షీణిస్తోందన్న మ్యాటర్ పై ఫోకస్ పెట్టి కొన్ని విషయాలు గుర్తించారు. ఫారిన్ ఇన్వెస్టర్లు దేశీయ స్టాక్స్ అమ్మేసి, నిధులు తీసుకెళ్లిపోతున్నారు. అందుకే రూపీ మారకపు రేటుపై ఒత్తిడి పెరుగుతోందంటున్నారు ఆర్థిక శాఖ కార్యదర్శి. అమెరికా ఆర్థిక వ్యవస్థ స్ట్రాంగ్ గా మారి ఉద్యోగ కల్పన పెరిగింది. నిరుద్యోగం తగ్గింది. సో అక్కడి వడ్డీ రేట్లు నిలకడగా ఉన్నాయి. అందుకే ఫారిన్ ఇన్వెస్టర్లంతా అమెరికా డాలర్ బాండ్లలో పెట్టుబడి పెట్టడానికి ఇంట్రెస్ట్ చూపుతుండడంతో మనలాంటి దేశాల నుంచి ఇన్వెస్ట్ మెంట్స్ తీసేసి అక్కడ పెడుతున్నారన్న మాట.గత నెల జనవరిలో ఏకంగా 48 వేల కోట్లు వెనక్కు పట్టుకెళ్లారు. దీంతో డాలర్ కు డిమాండ్ పెరిగి, రూపాయి డౌన్ అవుతోంది. అటు ముడి చమురు రేట్లు పెరగడం, దాంతో పాటే మన బిల్లు కూడా పెరిగి రూపాయిపైనే ఒత్తిడి పడుతోంది. ఇదే కాదు మనదేశంలో ద్రవ్యోల్బణం పెరిగింది. ఆర్థిక పరిస్థితులు బాగా లేవు. ఇది మరో కారణం. అటు రుపీ వాల్యూ తగ్గడంపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా పార్లమెంటుకు లేటెస్ట్ గా జవాబు ఇచ్చారు. రూపాయి విలువను మార్కెట్టే నిర్ణయించాలన్నారు. డాలర్‌తో పోలిస్తే, రూపాయి వాల్యూ ఇంతే ఉండాలన్న టార్గెట్ ఏమీ పెట్టుకోలేదన్నారు. సో సెంట్రల్ గవర్నమెంట్ స్టాండ్ క్లియర్ గా ఉంది. లెట్స్ వెయిట్ అండ్ సీ అని చూస్తున్నారు.డాలర్ తో పోలిస్తే రూపాయి వాల్యూ 87 రూపాయలకు చేరింది. అంటే ఇది ఆల్ టైమ్ రికార్డు. అంటే రూపాయి మరింతగా పతనం అవుతుందనడానికి సిగ్నల్స్ పంపింది. మరి ఇప్పుడు చేయాల్సింది చాలానే ఉంది. అలా వెయిట్ అండ్ సీ ఫార్ములా వర్కవుట్ కాదం టున్నారు కొందరు ఆర్థిక నిపుణులు. వెంటనే రంగం లోకి దిగకపోతే రూపాయి సెంచరీ దాటుతుందంటున్నారు.మనదేశం చమురు అవసరాల కోసం చాలా వరకు దిగుమతులపైనే ఆధారపడుతోంది. అలాగే ఎలక్ట్రానిక్ గూడ్స్, యంత్ర పరికరాలనూ చాలా వరకు దిగుమతి చేసుకోవాల్సిం దే. వాటన్నింటికీ డాలర్లలోనే చెల్లింపులు జరపాలి. అలా చేయడం వల్ల మన ఆర్థిక పారిశ్రామిక అభివృద్ధిపై ఎఫెక్ట్ పడుతుంది. అలాగే దిగుమతి చేసుకునే వంట నూనెలు, సహజవాయువు, బంగారం, లగ్జరీ కార్లు, గడియారాలు కొనాలన్నా చాలా మోతెక్కిపోతాయి. ద్రవ్యోల్బణం పెరిగి, ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతుంది. దీని ఫలితంగా నిత్యావసరాల ధరలు పెరుగుతాయి. ఫారిన్ కరెన్సీలో లోన్లు తీసుకున్న కంపెనీలకు భారం పెరుగుతుంది. వడ్డీ, అసలు తిరిగి చెల్లించడం చాలా కష్టమవుతుంది.దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే వ్యాపార సంస్థల లాభాల్లో కోత పడుతుంది. ఖర్చులు తడిసిమోపెడవుతాయి. స్టాక్‌మార్కెట్లలో తీవ్ర ఒడిదొడుకులతో ఇన్వెస్టర్లకు భారీ నష్టాలు తప్పవు. ఇవే కావు.. విదేశాల్లో ముఖ్యంగా అమెరికా వంటి దేశాలకు ఉన్నత చదువుల కోసం తమ పిల్లలను పంపే తల్లిదండ్రులపై భారం చాలా పెరుగుతుంది. యూనివర్సిటీ ఫీజులు, పిల్లల రోజువారీ ఖర్చుల కోసం ఎక్కువ రూపాయలు పెట్టి వాటిని డాలర్లుగా మార్చి పంపాలంటే తడిసి మోపెడవుతుంది. ఇది భారతీయ తల్లిదండ్రులకు పెను భారమే. లోన్లు, ఇతర అప్పులు ఎక్కువ చేయాల్సి వస్తుందన్న మాట.డాలర్ తో రూపాయి విలువ తగ్గితే మన దేశం నుంచి వస్తువులు, సర్వీసెస్ ఎక్స్ పోర్ట్స్ చేసేవారికి మాత్రం లాభం జరుగుతుంది. మన దేశం నుంచి ఐటీ సేవల ఎగుమతులు చాలా ఎక్కువ. మెడిసిన్స్, వజ్రాభరణాలు, దుస్తులు, ఇంజినీరింగ్ విడిభాగాలు, ఉత్పత్తులు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. ఈ రంగాల కంపెనీలు మాత్రం ఎక్కువ ఆదాయాలు, లాభాలు నమోదు చేసే వీలుంటుంది. అంటే రూపాయి విలువ తగ్గితే అంతర్జాతీయ మార్కెట్లో మన ఎగుమతులు చాలా తక్కువ ధరలకు లభించి సరకులకు గిరాకీ పెరుగుతుంది.అంటే బయటి వారు ఒక డాలర్ పెడితే ప్రస్తుత లెక్క ప్రకారం 87 రూపాయలకు ఇచ్చినట్లు లెక్క. ఆ లెక్కన మన వస్తువులు కొనే వారికి చాలా బెనిఫిట్ జరుగుతుంది.

# ధూమపానం, గుట్కాలతో క్యాన్సర్

హైదరాబాద్,ఈ మధ్య క్యాన్సర్ మరణలు పెరిగాయి. . పొగాకు, గుట్కా వంటి అలవాట్లతో పాటు, ఆహార పదార్థాల వల్ల కూడా క్యాన్సర్ వ్యాపిస్తోంది. క్యాన్సర్ ఆస్పత్రులు జనరల్ ఆస్పత్రులకన్నా కిటకిటాడుతున్నాయి. ఇది సోకిన వారు బతికి బట్టికట్టిన దాఖలాలు ఉండడం లేదు. ఏ స్టేజీలో ఉన్న మరణం తప్పడం లేదు. మంగళవారం నాడు ప్రపంచ కాన్సర్ దినోత్సవం. ఈ సందర్భంగా ..స్మోకర్స్ కు పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాల పై అవగాహన కలిగి ఉంటే మంచిది. ప్రధానంగా గుట్కా,ధూమపానం ప్రాణాలను హరించేస్తోంది. ఆరోగ్యవంతమైన జీవనాన్ని ఆస్వాదించాలంటే పొగాకు, గుట్కాలకు దూరంగా ఉండాలి. పొగ తాగడం వ్యసనంగా మారక ముందే ఫుల్ స్టాప్ పెట్టడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. పొగాకు, ధూమపానం అలవాట్లను మాన్పించడంలో సమాజంలో ప్రత ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. పొగాకు ఉత్పత్తులను ముందుగా అమ్మకుండా నిషేధించాలి. వాటిని తయారు చేయకుండా ఆంక్షలు విధించాలి. యువత సైతంచెడు స్నేహం వల్లో, సాంగత్య ప్రభావం వల్లనో పొగాకు ను అలవాటు చేసుకుంటున్నారు.అందుకే కాలేజీల కు వెళ్లే విద్యార్థులపై తల్లి దండ్రులు ఓ కన్నేసి ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సరదా గా మొదలయ్యే అలవాటు వల్ల జీవితం అవాంఛనీయ ఘటనలకు దారి తీయటం వాంఛనీయం కాదు. యోగా చేయడం,ఏదైనా ఇతర పనుల పై దృష్టి పెట్టడం ద్వారా కూడా దమ్ము కొట్టాలి అన్న ఆలోచన ను క్రమ,క్రమంగా దూరం చేసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. .అద్భుత ఫలితాన్ని సాధించవచ్చు అని చెప్పారు. పొగాకుతో క్యాన్సర్ ఎలా వస్తుంది అనే విషయం చెప్పటానికి,తెలుసుకోవటానికి వైద్యం చదవ వసరం లేదు. సిగరెట్, బీడీ తాగితే పొగాకు తో పెనవేసుకున్న రసాయనాలు శరీరం లోకి ప్రవేశించి కణాల డిఎన్ఏను నాశనం చేసే పనిలో పడతాయి. సిగరెట్ అలవాటు కు ముందు ,ఆ తర్వాత ఆరోగ్యం గురించి చెప్పొచ్చు. పొగతాగడం, గుట్కా తినం అంటే మృత్యువుకు 'దగ్గర' అయ్యే అవకాశాలే అధికంగా ఉన్నాయి. సిగరెట్ ,బీడీ కాల్చినపుడు వాటి నుంచే వెలువడే రసాయనాలు ఎంతటి ఉక్కు లాంటి కందరాల్ని ఐనా తుప్పు పట్టించే పనిలో ఉంటాయి. పటిష్ట మైన ఆరోగ్యం పునాదులను దారుణంగా దెబ్బ తీస్తాయి. కణాలుఅడ్డగోలుగా పెరిగేలా కారకం అవుతాయి తద్వారా కేన్సర్ కు దారి తీస్తాయి. ఆరోగ్యం గా ఉన్న కణాల డి ఎన్ ఏ ను దెబ్బ తీస్తాయి. అంటే శరీరం ఆకృతి ఇచ్చే కణాల పై ప్రభావం చూపుతాయి.

# బైపోల్ రాబోతుందా?

హైదరాబాద్,పార్టీ మారిన ఎమ్మెల్యేలను ఎట్టి పరిస్థితుల్లో తిరిగి చేర్చుకోవద్దని క్యాడర్ నుంచి కారు పార్టీ అధిష్టానంపై ప్రెజర్ ఉందంట.ఫిరాయింపు ఎమ్మెల్యేల ఇష్యూ క్లైమాక్స్‌కు చేరుతోంది. సుప్రీం ఆర్డర్స్..జంపింగ్ ఎమ్మెల్యేలకు అసెంబ్లీ సెక్రటరీ నోటీసులు..అంతా చకచకా జరిగిపోతోంది. సిచ్యువేషన్‌ను గమిస్తున్న..గులాబీ పార్టీ..కాంగ్రెస్ గూటికి చేరిన పది మంది బీఆర్ఎస్ శాసనసభ్యులపై వేటు పడటం ఖాయమన్న నమ్మకంతో ఉంది.అంతేకాదు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని క్యాడర్‌కు పిలుపునిచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. సుప్రీంలో విచారణ..తెల్లారే ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు..ఈ ఎపిసోడ్ అంతా చూస్తుంటే.. ఉపఎన్నికలు అనివార్యమన్న టాక్ వినిపిస్తోంది. పరిస్థితులు కూడా అలాగే కనిపిస్తున్నాయి. ఈ నెల 10న సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో మరింత క్లారిటీ రానుంది.బీఆర్ఎస్‌కు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 39 సీట్లు వచ్చాయి. అందులో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన పది ఎమ్మెల్యేలు హస్తం గూటికి చేరారు. మొదట దానం నాగేందర్ ఆ తర్వాత..వరుస పెట్టి మరో 9 మంది కూడా కండువా మార్చేశారు. దానం నాగేందర్ అయితే లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ బీఫామ్ మీద పోటీ చేసి ఓడిపోయారు.బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేటు కోసం న్యాయపోరాటం చేస్తూ వస్తున్న గులాబీ పార్టీ..చివరకు సుప్రీంకోర్టు మెట్లు కూడా ఎక్కింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించింది అత్యున్నత న్యాయస్థానం. ఈ నెల పదో తేదీ వరకు సమాధానం చెప్పాలని స్పీకర్‌ను కోరింది.

ఎమ్మెల్యేలకు నోటీసులు

తెల్లారే అసెంబ్లీ సెక్రటరీ నుంచి ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు అందాయి. వాళ్లు వివరణ ఇచ్చిన తర్వాత స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఉత్కంఠగా మారింది. మరోవైపు కేరళ హైకోర్టు కూడా ఎమ్మెల్యే ఫిరాయింపులపై స్పందించింది. పార్టీ మారాలనుకునేవారు రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయాలని సూచించింది.ఈ నేపథ్యంలో తెలంగాణలో పది స్థానాలకు ఉప ఎన్నికలు వస్తాయా అన్న చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో జరుగుతోంది. మరోవైపు గులాబీ బాస్ కేసీఆర్ ఈ మధ్యే కీలక వ్యాఖ్యలు చేశారు. కొడితే గట్టిగానే కొడతా అనడం వెనుక..ఉప ఎన్నికలు రాబోతున్నాయనే సంకేతం ఉందా అన్నది హాట్ టాపిక్ అవుతోంది.గులాబీ నేతలు అయితే పది స్థానాలకు ఉప ఎన్నికలు ఖాయమన్న భావనలో ఉన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అయితే బైపోల్స్‌కు సిద్ధం కావాలని క్యాడర్, లీడర్లకు పిలుపునిచ్చారు. కేసీఆర్ కూడా ఉపఎన్నికలు ఖాయమని డిసైడ్ అయ్యారట. అందుకే త్వరలో ప్రజాక్షేత్రంలోకి రావాలని భావిస్తున్నట్లు టాక్. ఈ నెలాఖరులోగా బహిరంగ సభకు కూడా ప్లాన్ చేస్తున్నారు.ఇదే విషయాన్ని జహీరాబాద్ కార్యకర్తల భేటీలో చెప్పారు గులాబీ బాస్. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎన్నికలు వస్తే ఫలితాలు తమకే అనుకూలమని అంచనా వేస్తున్న గులాబీ నేతలు..బైపోల్స్‌కు సై అంటున్నారు. గతంలో ఉప ఎన్నికల వచ్చినప్పుడు తాము గెలిచిన పరిస్థితులను గుర్తు చేస్తున్నారు.ఇక ప్రస్తుత పరిస్థితులు, నాలుగు స్కీమ్‌లపై ఉన్న గందరగోళ వాతావరణం పరిశీలిస్తే..కాంగ్రెస్ సర్కార్‌కు కష్టాలు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే 420 హామీలు, ఆరు గ్యారంటీలు నెరవేర్చాలని గులాబీ నేతలు నిలదీస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలతో కలిసి ఆందోళనలు చేస్తున్నారు. కాంగ్రెస్ ఎక్స్‌లో నిర్వహించిన పోల్‌లో కూడా ఫాంహౌస్ పాలన కావాలని 70 శాతం మంది ఓటేశారు. అందుకే ఈ సమయంలో ఉప ఎన్నికలు వస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి కాస్త కష్టమేనంటున్నారు పొలిటికల్ ఎనలిస్టులు.

ఇవన్నీ వరుస ఎపిసోడ్స్‌గా..

అయితే ఉపఎన్నికలు వస్తాయా రావా అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. ఓవైపు ఫిరాయింపు ఎమ్మెల్యేలు వివరణ ఇవ్వాల్సి ఉంది. వాళ్ల వివరణ తర్వాత స్పీకర్ నిర్ణయం తీసుకోనున్నారు. ఎమ్మెల్యేల వివరణ, స్పీకర్ నిర్ణయం..ఆ తర్వాత సుప్రీం తీర్పు ఇవన్నీ వరుస ఎపిసోడ్స్‌గా మారాయి. క్లైమాక్స్‌లో ఈ నెల 10న ఏదో ఒకటి క్లారిటీ వస్తుందన్న భావనలో బీఆర్ఎస్ ఉంది.ఇక వేటు తప్పదు..బైపోల్స్ వస్తాయన్న ప్రచారం నెలకొన్న వేళ..జంపింగ్ ఎమ్మెల్యేల దారెటు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హస్తం గూటికి చేరిన 10మందిలో ఎక్కువ మంది సంతృప్తిగా లేరన్న టాక్ ఉంది. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు అయితే ఓపెన్‌గానే తమ వాయిస్ వినిపిస్తున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన హైడ్రాను వ్యతిరేకిస్తున్నారు. అంతే కాదు తన ఇంట్లో కేసీఆర్ ఫోటో ఉంది..ఉంటే తప్పేంటని ప్రశ్నిస్తున్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కూడా కేసీఆర్ ఫోటో బరాబర్ పెట్టుకుంటానంటూ...

# ఎమ్మెల్యేల సీక్రెట్ మీటింగ్‌తో ఉలిక్కిపడ్డ కాంగ్రెస్..





హైదరాబాద్,అంతా బాగుంది కానీ ఎక్కడో తేడా కొడుతుంది సీనా అన్నట్లు ఉంది కాంగ్రెస్ పార్టీ పరిస్థితి. ఓ ఇష్యూ అయిపోగానే మరో టాపిక్‌తో..అయితే అంతర్గత కుమ్ములాటలు.. లేకపోతే అపోజిషన్ ప్రెజర్‌తో సతమతం అవుతున్న కాంగ్రెస్ పార్టీకి పిడుగులాంటి వార్త గుండెలు గుభేల్ చేసిందట. అదే ఎమ్మెల్యేల సీక్రెట్ మీటింగ్. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆర్గనైజ్ చేసిన మీటింగ్‌కు పది మంది ఎమ్మెల్యేలు వెళ్లారన్న ప్రచారం కాంగ్రెస్ పెద్దలను, తెలంగాణ రాజకీయాలను మరింత ఇంట్రెస్టింగ్‌గా మార్చేశాయి.

ఆ భేటి నిజమే అంటున్న ఎమ్మెల్యేలు :

ఓ మంత్రి తీరుపై ఎమ్మెల్యేలు అసంతృప్తి రాగం వినిపించారని..దాని వెనుక ఎన్నో ఈక్వేషన్స్ ఉన్నాయని..రకరకాల ఊహాగానాలు వినిపించాయి. అయితే భేటీ అయింది నిజమేనని పలువురు ఎమ్మెల్యేలు ఓపెన్‌గానే స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ విషయంలో పీసీసీ చీఫ్ మాట్లాడిన ఒకరిద్దరు ఎమ్మెల్యేలు తగ్గేదేలే అని చెప్పడంతో.. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షి టచ్‌లోకి వచ్చారు. తాను వచ్చే వరకు ఎక్కడా ఈ విషయం గురించి మాట్లాడొద్దని ఆమె ఎమ్మెల్యేకు సూచించారు.

ఆ జిల్లాల నేతలతో సీఎం భేటీ :

అయితే ఎమ్మెల్యేల సీక్రెట్ మీటింగ్ ఇష్యూ చర్చనీయాంశం కావడంతో కాంగ్రెస్ పెద్దలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారట. ఈ పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా భేటీ అయి..అంతా సెట్ చేయాలని భావిస్తున్నారు. అందులో భాగంగానే సీఎం రేవంత్ రెడ్డి, ఇంచార్జ్ దీపాదాస్ మున్షి, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌లు ఎమ్మెల్యేలతో ప్రత్యేక భేటీ కానున్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఎమ్మెల్యేలకు టైమ్ కేటాయించారు. మొదట ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలతో భేటీ కానున్నారు. ఆ తర్వాత కరీంనగర్ వరంగల్ జిల్లాల ఎమ్మెల్యేలతో చర్చిస్తారు. చివరగా మెదక్, నల్లగొండ, హైదరాబాద్, మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల ఎమ్మెల్యేలతో డిస్కస్ చేసి.. వాళ్ల ప్రాబ్లమ్స్ ఏంటో విననున్నారు.అయితే రహస్య భేటీ అయిన పది మంది ఎమ్మెల్యేలతో దీపాదాస్ మున్షి భేటీ అవుతారని నాలుగు రోజులుగా చర్చ జరుగుతోంది. కానీ పార్టీకి చెందిన అందరు ఎమ్మెల్యేలతో సమావేశం అవుతుండటం ఆసక్తి రేపుతోంది. అయితే సీక్రెట్ మీటింగ్ వెళ్లని మరికొందరు ఎమ్మెల్యేలు కూడా మంత్రుల తీరుపై అసంతృప్తిగా ఉన్నారట. తమ నియోజకవర్గ సమస్యలు చెప్పుకోవడానికి వెళ్తే టైమ్ ఇవ్వడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. అధికారులు కూడా తమ మాట వినడం లేదని ఆగ్రహంతో రలిగిపోతున్నారట హస్తం పార్టీ ఎమ్మెల్యేలు. గాంధీభవన్‌లో జరిగిన భేటీ కేసీ వేణుగోపాల్ క్లాస్ తీసుకున్నా మంత్రుల తీరులో మార్పు రావడం లేదట. అందుకే ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా భేటీ కావాలని నిర్ణయించారట. అది కూడా ఒక్కొక్కరితో ప్రత్యేకంగా మాట్లాడే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తుంది.అయితే భేటీ హాట్ హాట్‌గా సాగే అవకాశం ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. మంత్రుల తీరుపై అసంతృప్తితో రలిగిపోతున్న పలువురు ఎమ్మెల్యేలు తమ వాయిస్ బలంగా వినిపించాలని ఫిక్స్ అయ్యారట. సీఎం, రాష్ట్ర ఇంచార్జ్ ముందే ఏదో ఒకటి తేల్చుకోవాలని భావిస్తున్నారట. అయితే మంత్రులతో ఎమ్మెల్యేల గ్యాప్‌ను ఎలా సెట్ చేస్తారన్నదే హాట్ టాపిక్‌గా మారింది.కేసీ వేణుగోపాల్ చెప్తే కూడా పలువురు మంత్రుల తీరులో మార్పు రాలేదంటే..సీఎం రేవంత్, దీపాదాస్ మున్షి చెప్తే.. ఎమ్మెల్యేలతో రాజీకి ఒప్పుకుంటారా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఒకరిద్దరు మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు మధ్య ఉన్న పంచాయితీని తెంపడం అంత ఈజీ కాదన్నది గాంధీభవన్ వర్గాల టాక్. ఈ పరిస్థితుల్లో ప్రత్యేక భేటీ అన్ని ఇష్యూస్‌కు ఎండ్ కార్డు వేస్తుందా.. లేక హస్తినకు దారి తీస్తుందా అనేది ఉత్కంఠ రేపుతోంది.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు :

ఇక బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలను జనంలోకి పాజిటీవ్‌గా తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు దిశానిర్ధేశం చేయనున్నారట పార్టీ పెద్దలు. త్వరలో లోకల్ బాడీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో.. అనుసరించాల్సిన వ్యూహంపై కూడా డిస్కస్ చేస్తారట. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు ఇచ్చే 42 శాతం రిజర్వేషన్లను బలంగా జనంలోకి తీసుకెళ్లాలని భావిస్తుంది కాంగ్రెస్ పార్టీ. అలాగే ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉంటున్న ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనన్న విషయాన్ని విస్తృతంగా పబ్లిక్‌లోకి తీసుకెళ్లాలని అనుకుంటోంది.ఎమ్మెల్యేలతో ప్రత్యేక భేటీలో చాలా అంశాలు చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యేల నియోజకవ ర్గాల్లో లోకల్ లీడర్లతో ఉన్న ఇబ్బందులు, మంత్రులతో గ్యాప్, అధికారులు తమ మాట వినడం లేదన్న విషయాలన్నీ సీఎంతో పాటు పార్టీ పెద్దలకు చెప్పుకోనున్నారట ఎమ్మెల్యేలు. ప్రత్యేక భేటీ తర్వాత అయినా ఎమ్మెల్యేల సమస్యలు పరిష్కారం అవుతాయా..లేక కథ మళ్లీ మొదటికే వస్తుందా అనేది వేచి చూడాలి మరి.

# బిసి కులగణన సర్వే తప్పుల తడక

హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సర్వేలో బీసీ జనాభాను తగ్గించి వారిని దారుణంగా వెన్నుపోటు పొడిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తప్పులతడకగా లెక్కలు వేసి సర్వే పూర్తయిందని చెప్పడం ముమ్మాటికీ వెనకబడిన వర్గాలను మోసం చేయడమేనని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి కేటీఆర్ లేఖ రాశారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ కులగణన సర్వే పూర్తి చేసిందని లోక్ సభలో మీరు చెప్పడం పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించడమేనని కేటీఆర్ మండిపడ్డారు. లక్షలాది మంది వివరాలు సేకరించకుండా సర్వే ఎలా పూర్తవుతుందని రాహుల్‌ని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాట మాట్లాడే కాంగ్రెస్ నిజస్వరూపం ఏడాది కాలంగా అనేక రూపాల్లో బయటపడిందని కేటీఆర్ చెప్పుకొచ్చారు. బీసీల జనాభాను తగ్గించి చారిత్రక తప్పిదం చేసిన కాంగ్రెస్ పార్టీని తెలంగాణలోని వెనకబడిన వర్గాలు ఎప్పటికీ క్షమించవని కేటీఆర్ ధ్వజమెత్తారు. గ్యారెంటీల పేరిట చేసిన గారడీని, డిక్లరేషన్ పేరిట చేసిన ఈ దగాను చూసిన తర్వాత వచ్చే స్థానిక ఎన్నికల్లోనే కాదు.. ఏ ఎన్నికల్లోనూ ఇక కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మరని కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ వేదికగా బీసీ డిక్లరేషన్ ఓ నాటకమని, బీసీలకు స్థానిక ఎన్నికల్లో కల్పిస్తామన్న 42 శాతం రిజర్వేషన్ల హామీ బూటకమని తేలిపోయిందని చెప్పారు. ఈ మేరకు తెలంగాణ బీసీలకు రాహుల్ గాంధీ బేషరతుగా క్షమాపణ చెప్పాలంటూ కేటీఆర్ లేఖలో డిమాండ్ చేశారు. తెలంగాణలో అమలు చేయని హామీలను, ఇక్కడి ప్రజలకు అందిస్తున్నట్టు ఎలా ప్రచారం చేసుకుంటారని రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ కులగణన సర్వేను అంశాన్ని ఇతర రాష్టాల్లోన్రూ వాడుకోవాలనే ఎత్తుగడలో భాగంగానే పార్లమెంట్‌లో దీని ప్రస్థావన తెచ్చారని ఆయన మండిపడ్డారు. కులగణన తప్పులను సవరించాల్సిన బాధ్యత మరిచి బంతిని కేంద్రం పరిధిలోకి నెట్టి చేతులు దులుపుకోవాలని చూస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. తెలంగాణ బీసీ సంఘాల నేతలు ఏకంగా కులగణన నివేదికను చించివేసి నిరసన తెలిపారని, రాష్ట్ర ప్రభుత్వం చేసిన కులగణన అంతా తప్పులతడకేనని చెప్పడానికి ఇంతకన్నా ఉదాహరణ ఇంకేం కావాలని అన్నారు. ఈ సర్వేతో బీసీలకు న్యాయం జరగకపోగా కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన అన్యాయం చేసిందని కేటీఆర్ దుయ్యబట్టారు.



పదేళ్లలో అగ్రవర్ణాల జనాభా పెరిగి, బీసీల జనాభా తగ్గడం ఎలా సాధ్యమో చెప్పగలరా? రాహుల్ గాంధీ అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. వెనకబడిన వర్గాల భవిష్యత్తును నిర్దేశిరచే కీలకమైన కోటాను తప్పుల కుప్పగా తయారు చేయడం, కాంగ్రెస్ పార్టీకి బీసీల పట్ల ఉన్న నిలువెత్తు నిర్లక్ష్యానికి అద్దంపడుతోందని అన్నారు. తప్పుడు లెక్కల వల్ల రానున్న రోజుల్లో ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని బీసీ బిడ్డలు ఆందోళన వ్యక్తం చేస్తుంటే, వాస్తవాలు తెలుసుకోకుండా రాహుల్ గాంధీ మాట్లాడటం దారుణమన్నారు. బీసీలకు తీవ్ర అన్యాయం చేసే ఈ ఫెయిల్యూర్ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని పార్లమెంట్‌లో రాహుల్ కోరడం మరో విడ్డూరమని అన్నారు. పదేళ్ల కిందట అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల సంఖ్య 1.85 కోట్లుగా తేలిందని, రాష్ట్ర జనాభాలో ఇది 51 శాతంగా ఉందని కేటీఆర్ గుర్తు చేశారు. మైనారిటీల్లో ఉన్న బీసీలనూ కలిపితే ఆనాడు బీసీల సంఖ్య ఏకంగా 61 శాతానికి చేరిందని స్పష్టం చేశారు. అలాంటిది పదేళ్ల తర్వాత కాంగ్రెస్ సర్కార్ కులగణన సర్వేలో బీసీల జనాభా 1.64 లక్షలకు ఎలా తగ్గిందని, 46 శాతానికి ఎలా పడిపోయిందో చెప్పాలని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. దశాబ్ద కాలంలో బలహీన వర్గాల జనాభా తగ్గినట్టు చూపిన ఈ తప్పుడు లెక్కలను ఎవ్వరూ నమ్మే పరిస్థితుల్లో లేరని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. అసమగ్రంగా జరిగిన సర్వే పూర్తయిందని సాక్షాత్తూ దేశ అత్యున్నత చట్టసభలో పేర్కొనడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ధ్వజమెత్తారు.

# కోళ్లకు అంతుచిక్కని వ్యాధి..! రైతుల్లో ఆందోళన..



హైదరాబాద్,కోళ్లకు అంతుచిక్కని వ్యాధిపై గోదావరి జిల్లాల పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని పౌల్ట్రీలకు ఈ వ్యాధి లేకపోయినా కొన్నిచోట్ల జాడ కనిపిస్తుంది.అంతుచిక్కని వైరస్ కోళ్లకు వ్యాపించడంతో పౌల్ట్రీ రైతులు ఆందోళనలో ఉన్నారు. ఒక్కో కోడి 300 రూపాయలు వరకు ధర ఉండగా.. అవి మృత్యు వాత పడకుండా రక్షించుకునేందుకు టీకాలు వేయిస్తున్నారు. లక్ష కోళ్లు పెంచేందుకు 3 కోట్ల రూపాయలు వరకు పెట్టు బడి అవుతుండగా అధికశాతం రైతులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న వారే.. మాంసం కోసం 45 రోజులపాటు పెంచే బ్రాయిలర్ కోళ్లు ఉమ్మడి గోదావరి జిల్లాలో కోటి వరకు ఉంటాయి. ఒక బ్రాయిలర్ కోడి రెండు కిలోల వరకు తయారయ్యేందుకు 200 రూపాయలు వరకు ఖర్చు వుతుంది. నిన్నమొన్నటి వరకు కిలో చికెన్ ధర 140 రూపాయలు వరకు ఉండడంతో లాభాలపై ఆశలు పెట్టుకున్నారు.అయితే, కొత్త వైరస్ తో ఇప్పుడు ఆందోళనలో ఉన్నారు పౌల్ట్రీ రైతులు.. కోళ్ల మృత్యువాతతో నష్టపోతున్న రైతులు సాయం కోసం ఎదురు చూస్తున్నారు. అనపర్తి, కొవ్వూరు ప్రాంతాల్లో కొన్నిచోట్ల కోళ్లలో వైరస్ జాడలు కనిపించాయి. ప్రస్తుతం వైరస్ ప్రభావం వల్ల గుడ్లు, మాంసం తినే ప్రజల ఆరోగ్యానికి ఎటువంటి ఇబ్బంది లేదు. ప్రజలంతా నిశ్చింతగా తినవచ్చు. మన దేశంలో ఉడక బెట్టినవి తినడం అలవాటు. ఇప్పటివరకు ఎవరికీ కోళ్ల వల్ల ఇబ్బందికలిగిన దాఖలాలు లేవు అంటున్నారు పశుసంవర్ధకశాఖ అధికారులు. పెరవలి మండలం కానూరు అగ్రహారంలో 80 కోళ్ల నుంచి నమూనాలు సేకరించి మధ్యప్రదేశ్ లోని భోపాల్ కేంద్రీయ ప్రయో గశాలకు పంపడం జరిగిందని చెబుతున్నారు తూర్పుగోదావరి జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శ్రీనివాసరావు..

# మాటిస్తున్నా.. జగన్ 2.0 పాలన వేరుగా ఉంటుంది

అమరావతి,సంచలన వ్యాఖ్యలు చేశారు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి. తాజాగా విజయవాడ పార్టీ కార్పొరేటర్లు.. నేతలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన నోటి నుంచి కీలక వ్యాఖ్యలు వచ్చాయి. వైసీపీ బతుకుతుందని.. రాష్ట్రాన్ని ఏలుతుందన్న ఆయన.. మరో 30 ఏళ్లు ఏలుతామన్న జగన్మోహన్ రెడ్డి "జగన్ 2.0 పాలన వేరుగా ఉంటుంది. ఇంతకు ముందు ప్రజల గురించే పని చేశా. ఇప్పుడు కార్యకర్తలకు ఏం చేస్తానో చూస్తారు. వైసీపీ కార్యకర్త వెంట్రుకను కూడా ఎవరూ పీకలేరు' అంటూ ఆయన మాట్లాడిన మాటలు గూస్ బంప్స్ తెచ్చేలా చేశాయి. పార్టీ కార్పొరేటర్లకు.. నేతలకు కొత్త బలాన్ని తెచ్చేలా జగన్ మాటలు ఉండటం గమనార్హం.పార్టీ కార్యకర్తలకు చంద్రబాబు పెడుతున్న ఇబ్బందుల్ని తాను చూశానని.. కార్యకర్తల బాధలన్నింటినీ గమనిస్తున్నట్లుగా పేర్కొన్నారు. తనను పదహారు నెలలు జైల్లో పెట్టారని..అయినా బయటకు రాలేదా? అని ప్రశ్నించిన జగన్.. "నేను బయటకు రాలేదా? ముఖ్యమంత్రిని కాలేదా? మీపైనా కేసులు పెడతారు. మహా అయితే మూడు నెలలు లోపలేస్తారు. తర్వాత రెట్టించిన ఉత్సాహంతో బయటకు వస్తాం. మీకు చెడు చేసిన ప్రతి ఒక్కడినీ.. అలాగే మంచి చేసిన వాడినీ గుర్తు పెట్టుకోండి" అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. విలువలు.. విశ్వసనీయతతోనే అఖండ మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానన్న ధీమాను వ్యక్తం చేసిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. "ఓడిపోయాం ఫర్లేదు. ప్రతిపక్షంలో కూర్చున్నాం. అదీ ఫర్లేదు. జమిలి అంటున్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా విజయం మనదే" అంటూ వ్యాఖ్యానించారు. చంద్రబాబు వాళ్ల కంటే వైసీపీ ఎమ్మెల్యేలు.. నాయకులే మంచివాళ్లుగా ప్రజలకు కనిపిస్తున్నారన్న జగన్.. చంద్రబాబు ఇచ్చిన సూపర్



సిక్స్ హామీలు మోసమని.. తాను ఎన్నికల వేళలోనే చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.'వ్యవస్థలన్ని కుప్పకూలాయి. చంద్రబాబు ఇచ్చిన హామీలు పక్కకు పోయాయి. ఇసుక.. మద్యం అన్నింటా కుంభకోణాలే. వాళ్లకంటే వైసీపీ ఎమ్మెల్యేలు.. నాయకులే మంచివాళ్లుగా ప్రజలకు కనిపిస్తున్నారు. సంపద స్రష్టిస్తానంటూ ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు సంపద ఎలా క్రియేట్ చేయాలో చెవిలో చెప్పాలని అంటున్నారు. హామీలను అమలు చేయకపోతే కాలర్ పట్టుకోవాలని ఎన్నికలప్పుడు చెప్పాడు. ఇప్పుడు ప్రజలు కాలర్ పట్టుకొని ప్రశ్నిస్తారన్న భయంతో రెడ్ బుక్ పాలన సాగిస్తున్నారు" అంటూ కూటమి ప్రభుత్వ పాలనను తనదైన శైలిలో ఎండగట్టారు. జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యలు కొత్త శక్తిని ఇవ్వటంతో పాటు.. భవిష్యత్తు పట్ల మరింత ధీమాను తీసుకొచ్చేలా చేసిందన్న మాట వినిపిస్తోంది.

# లోకేష్ ని బిజేపీ పెద్దలు దీవించినట్లేనా ?



అమరావతి,తెలుగుదేశం అధినేత చంద్రబాబు రాజకీయ జీవితంలో పెద్దగా కష్టాలు అయితే లేవు. ఆయన 1978లో యువకుడిగా ఉన్నపుడే కాంగ్రెస్ ఐ అన్న కొత్త పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తరువాత అంతటి కాంగ్రెస్ మహా సాగరంలో మంత్రి కూడా అయ్యారు.ఇక కాంగ్రెస్ ఉమ్మడి ఏపీలో ఓడినా చంద్రబాబు రాజకీయం మాత్రం గెలుస్తూ వచ్చింది. అందుకే సొంత మామ ఎన్టీఆర్ పెట్టిన టీడీపీలో చేరి అక్కడ తన స్థానం సుస్థిరం చేసుకున్నారు. 1995లో సీఎం అయిపోయారు. నాటి నుంచి టీడీపీ బాబు పగ్గాలలోనే ఉంది.ఆయన తనయుడు నారా లోకేష్ 2009 ఎన్నికలలో పరోక్ష పాత్రతో రాజకీయాల్లోకి తన పరిచయాన్ని చేసుకున్నారు ఆయన 2014లో పార్టీ విజయం వెనక కూడా తెర వెనక పాత్ర పోషించారు అంటారు. అలా 2017 నాటికి మంత్రి అయిపోయారు 2024 లో మరోసారి మంత్రిగా పార్టీలో అత్యంత కీలకంగా మారారు.ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఇపుడు లోకేష్ చాలా ప్రాధాన్యతతో కూడిన పాత్రను పోషిస్తున్నారు. ఆయన తాజాగా ఢిల్లీ పర్యటన చేపట్టారు. చాలా మంది కేంద్ర మంత్రులను కలిసారు అందులో రాజ్ నాథ్ సింగ్ వంటి వారు లోకేష్ తో బాగా కలివిడిగా మాట్లాడారు. అశ్విని వైష్ణవ్ కూడా అదే తీరున అభిమానం చూపించారు. ధర్మేంద్ర ప్రధాన్ అయితే లోకేష్ తో బాగా ముచ్చటించారు.ఇలా కేంద్రంలో కీలక మంత్రులు అంతా లోకేష్ ని బాగా రిసీవ్ చేసుకున్నారు. ఇంతకు ముందే లోకేష్ బీజేపీలోని నంబర్ టూగా ఉన్న అమిత్ షాని కలిశారు. విశాఖ వచ్చిన ప్రధాని మోడీ ముందే తన స్పీచ్ తో ఆకట్టుకున్నారు ఇవన్నీ చూసిన వారికి కేంద్రంలో బీజేపీ పెద్దల ఆశీస్సులు బాబు వారసుడికి దక్కినట్లేనా అని చర్చించుకుంటున్నారు. చంద్రబాబు ఢిల్లీకి వెళ్తే ఏ రకమైన రిసీవింగ్ లభిస్తుందో అదే లోకేష్ కి దక్కుతోంది.లోకేష్ వెంట టీడీపీకి చెందిన కేంద్ర మంత్రులతో పాటు పార్టీ ఎంపీలతో ఒక భారీ బృందమే కనిపిస్తోంది. ఇలా లోకేష్ కమలం పార్టీ పెద్దలను కలుస్తూ ఏపీకి ఏమి కావాలో వివరిస్తున్నారు. అదే సమయంలో ఆయన ఏపీలో తన పాత్ర ఏమిటి అన్నది చెప్పకనే చెబుతున్నారని అంటున్నారు. అంతే కాదు జాతీయ మీడియాతోనూ ఆయన ఇంటరాక్ట్ అవుతున్నారు.ఏపీ నుంచి చంద్రబాబు వస్తే కనబరచే ఆసక్తి ఇపుడు లోకేష్ విషయంలోనూ జాతీయ మీడియా కనబరుస్తోంది. ఇవన్నీ చూసిన వారు అంతా అనేది ఒక్కటే అంటున్నారు. ఏపీకి ఫ్యూచర్ లీడర్ లోకేష్ అన్నది జాతీయ రాజకీయాలలో ఉన్న వారికి కూడా అర్ధం అయిందా అన్నది. లోకేష్ కూడా స్వామి కార్యం స్వకార్యం అన్నట్లుగా తన ఇమేజ్ ని పెంచుకోవడంతో పాటుగా పార్టీని ప్రభుత్వాన్ని ఎలివేట్ చేస్తున్నారు. అలాగే ఏపీకి కేంద్రం నుంచి రావాల్సినవి అడుగుతున్నారు.ఒక విధంగా బాబుకు భారం తగ్గిస్తున్నారు. అదే సమయంలో తానే భవిష్యత్తు అని అటు పార్టీకి ప్రభుత్వానికి కూడా సంకేతాలు ఇస్తున్నారు. ఈ తరహా వ్యూహంతో లోకేష్ ఇపుడు జాతీయ రాజకీయాల్లో హైలెట్ అవుతున్నారు. పెద్దాయన జేసీ దివాకర్ రెడ్డి లోకేష్ బాబు మరో మూడేళ్ళ తరువాత సీఎం అవుతారని అంటున్నారు కానీ చినబాబు జోరు చూస్తుంటే ఆయన అంతకంటే ముందే అయ్యేట్లుగా ఉన్నారని అంటున్నారు.ఇక బీజేపీ పెద్దలకు ఏపీ రాజకీయం కావాలి. అందువల్ల వారు లోకేష్ కి తమ నిండు ఆశీస్సులు అందించక తప్పదని అది అనివార్యమని కూడా అంటున్నారు. బహుశా తనతోనే టీడీపీ అన్న సందేశాన్ని కూడా ఈ పర్యటనలో లోకేష్ జాతీయ పెద్దలకు ఇచ్చి ఉంటారని అంటున్నారు. సో లోకేష్ బాబు ఢిల్లీ టూర్ అయితే ఆయన ఇమేజ్ ని కొత్తగా బిల్డప్ చేయడంలో సూపర్ హిట్ అయినట్లే అని అంటున్నారు.

# తాను మునిగి.. కేజ్రీని ముంచుతున్న కాంగ్రెస్!

న్యూఢిల్లీ,తాను మునగడమే కాకుండా.. ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీని కూడా కాంగ్రెస్ పార్టీ ముంచేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత.. పలు చానెళ్లు చర్చ చేపట్టా యి. దీనిలో జాతీయ స్థాయి విశ్లేషకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రధానంగా ఆమ్ ఆద్మీ పార్టీ గెలుస్తుందని ఒక్క కేకే సర్వే మాత్రమే చెప్పిన దరిమిలా.. ఆప్ ఓటమి..కి కారణాలు వెతికే పని ప్రారంభించారు. దీనిలో ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ తెరమీదికి వచ్చింది. జాతీయ స్థాయిలో 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆప్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగింది.కానీ, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు వచ్చే సరికి మాత్రం ఆప్‌తో విభేదించింది. వాస్తవానికి కేజ్రీవాల్ 5-10 స్థానాలను ఇచ్చేందుకు ఆదిలో ముందుకు వచ్చారు. కానీ, కాంగ్రెస్ 25 స్థానాలకు పట్టుబట్టింది. దీంతో కేజ్రీవాల్ ఒంటరి పోరుకు రెడీ అయ్యారు. దీంతో బెట్టు పోయిన కాంగ్రెస్ తాము కూడా ఒంటరి పోరు చేస్తామనిప్రకటించి.. 70 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇది పెద్ద తప్పని అప్పట్లోనే విశ్లేషణలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ పావుకునేది ఏమీ లేదని.. ఉన్న ఓట్లను చీల్చడం ద్వారా బీజేపీకి మేలు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని.. పెద్ద ఎత్తున వ్యాసాలు, విశ్లేషణలు కూడా వచ్చాయి.అయినా.. కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గలేదు. పైగా.. బీజేపీని తాజా ఎన్నికల్లో పన్నెత్తు మాట అనకుండా.. అక్రమార్కుడు, అవినీతి పరుడు, అద్దాల బంగళా కట్టుకున్నాడంటూ.. రాహుల్ గాంధీ.. మాజీ సీఎం కేజ్రీవాల్‌పైనే విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారం ఢిల్లీ ప్రజలకు చిర్రెత్తుకొచ్చేలా చేసింది. ఈ పరిణామాలను బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకుని.. కాంగ్రెస్‌ను పన్నెత్తుమాట అనుకుండా.. కేజ్రీవాల్‌పైనే విమర్శల బాణాలు వేసింది. ఫలితంగా.. ప్రజలకు కేజ్రీవాల్ విలన్ అయ్యారన్నది విశ్లేషకుల అంచనా. పోనీ.. ఈ పరంపరలో కాంగ్రెస్‌ను హత్తుకున్నారా? అంటే.. అసలు కాంగ్రెస్‌లో బలమైన నాయకత్వం లేకపోవడం.. సీఎం అభ్యర్థి ని కూడా ప్రకటించకపోవడంతో ప్రజలు ఆ పార్టీవైపు మొగ్గు చూపలేదు.మొత్తంగా.. కాంగ్రెస్ వ్యవహరించిన తీరు బీజేపీకి మేలు చేసే పరిస్థితిని తీసుకువచ్చిందని అంటున్నారు. క్లియర్ కట్గా బీజేపీ ఎగ్జిట్ పోల్స్‌లో ఇంత మెజారిటీ దక్కించుకునేందుకు కాంగ్రెస్, ఆప్‌లపై ప్రజలకు ఏర్పడిన అసహనమేనని పేర్కొన్నారు. తాను మునిగి.. తన జాతీయ మిత్రపక్షం ఆప్‌ను కూడా ముంచేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని



అంటున్నారు. ఈ పరిణామాలు ఎలా ఉన్నా.. బీజేపీ మాత్రం గెలుపు అంచుల వరకు చేరుకోవడం గమనార్హం. ప్రస్తుతం ఎగ్జిట్ పోల్స్ ఫలితాలన్నీ.. దాదాపు బీజేపీ పట్టం కట్టగా.. కాంగ్రెస్ కేవలం 1 అరా స్థానాలకే పరిమితం కానుందన్న లెక్కలు హస్తం నేతలకు ఇబ్బందిగా మారాయి.

## హైదరాబాద్ శివారులో అగ్ని ప్రమాదం

హైదరాబాద్,హైదరాబాద్ శివారులోని చర్లపల్లి పారిశ్రామికవాడలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మొదట శేషసాయి కెమికల్ పరిశ్రమలో మంటలు చెలరేగాయి. కొద్దిసేపటికే ఆ మంటలు పక్కనే ఉన్న మహాలక్ష్మి రబ్బర్ కంపెనీకి విస్తరించాయి. దీంతో ఆ ప్రాంతంమంతా దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. రసాయన పరిశ్రమలో మంటలు అంటుకోవడంతో అక్కడున్న కెమికల్ డ్రమ్ములు పేలిపోయాయి. దీంతో మంటలు ఫ్యాక్టరీలో భారీగా ఎగసిపడుతున్నాయి.మంటల ధాటికి ఫ్యాక్టరీలో ఉన్న రసాయన డ్రమ్ములు పేలిపోతున్నాయి. అగ్నిప్రమాద ప్రాంతం మొత్తం దట్టమైన పొగ వ్యాపించింది. రసాయనాల నుంచి వచ్చే ఘాటైన పొగతో చర్లపల్లిలోని కెమికల్ ఫ్యాక్టరీ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.దట్టమైన పొగతో స్థానికులు ఉక్కిరిబిక్కిరై పరుగులు తీశారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు.అగ్నిప్రమాదం సంబవించడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com